



అనకాపల్లి ఆవఖండం ప్రాంతంలో చెరువును తలపిస్తున్న వరి పొలాలు

వీడని మొంథా ఛాయలు

పలుచోట్ల భారీ వర్షం

- రోజంతా ముసురు, చిరు జల్లులు
- జలాశయాలు, నదుల్లో కొనసాగుతున్న వరద
- 1,381 హెక్టార్లలో వరి నీట మునిగినట్టు ప్రాథమిక అంచనా
- 367 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు ధ్వంసం
- పంచాయతీరాజ్ శాఖకూ తీవ్ర నష్టం

అనకాపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాన్ తీరందాటి రెండు రోజులైనప్పటికీ జిల్లాలో దాని ప్రభావం ఇంకా కొనసాగుతూనే వుంది. గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. గాలులు సైతం బలంగా వీచాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అక్కడక్కడా జల్లులు పడ్డాయి. మరోవైపు జలాశయాల్లోకి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో అధికారులు గేట్లు ఎత్తి నదుల్లోకి నీటిని విడిచిపెడుతున్నారు. దీంతో నదులు, వాగుల్లో వరద ఉధృతి తగ్గలేదు. లోతట్టు ప్రాంతాల్లోని పంట భూములు ఇంకా ముంపులోనే వున్నాయి. వీలున్నచోట పొలాల్లో నుంచి నీటిని బయటకు పంపడానికి రైతులు ప్రయత్నిస్తున్నారు. కాగా 78 పునరావాస కేంద్రాలు గురువారం కూడా కొనసాగాయి. వీటిల్లో 985 మందికి అల్పాహారం, భోజన సదుపాయం కల్పించారు.

పంట నష్టం అంచనాలో వ్యవసాయ శాఖ

వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. అధికారుల ప్రాథమిక అంచనా మేరకు గురువారం సాయంత్రానికి 1,381 హెక్టార్లలో వరి పంట నీటమునిగింది. కానీ మండలాల నుంచి వస్తున్న సమాచారాన్నిబట్టి ఇది మరింత ఎక్కువ వుండే అవకాశం వుంది. అనకాపల్లి మండలంలో అత్యధికంగా 570 హెక్టారుల్లో వరి పంట నీట మునిగింది. బుచ్చెయ్యపేట మండలంలో 93 హెక్టార్లు, చోడవరంలో 84, సబ్బవరంలో 54, కశింకోటలో 65, మునగపాకలో 79, దేవరాపల్లిలో 24, కె.కోటపాడులో 49, చీడికాడలో 8, గొలుగొండలో 14, నర్సీపట్నంలో 21, నాతవరంలో 10, అచ్యుతాపురంలో 4, మాడుగులలో 2, కోటవురట్లలో 2, రాంబిల్లిలో 78, పరవాడలో 6, రావికమతంలో 7, ఎలమంచిలిలో 35 హెక్టార్లలో వరి నీట మునిగింది. బొప్పాయి 6 హెక్టార్లు, అరటి 9.6, కూరగాయలు 10.2 హెక్టార్లలో దెబ్బతిన్నది.

ధ్వంసమైన రోడ్లు

భారీ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల రహదారులు ధ్వంసమయ్యాయి. ఆర్‌అండ్‌బీకి చెందిన 366.92 కిలోమీటర్ల పొడవుగల రోడ్లు 79 చోట్ల పూర్తిగా దెబ్బతిన్నాయి. అనకాపల్లి, చోడవరం, సబ్బవరం, బుచ్చెయ్యపేట, ఎలమంచిలి, పరవాడ, ఎస్.రాయవరం, నక్కపల్లి, కె.కోటపాడు, నర్సీపట్నం, చీడికాడ, మునగపాక, కశింకోట, నాతవరం, అచ్యుతాపురం మండలాల్లో ఎక్కువ నష్టం వాటిల్లింది. 13 కల్వర్టులు ధ్వంసం అయ్యాయి. వీటి మరమ్మతులకు ఎంతమేర నిధులు అవసరమో ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు.



అనకాపల్లి మండలం కుంచంగిలో నీటమునిగిన పంట పొలాలు



చోడవరం మండలం చాకిపల్లి వద్ద వరద ముంపులో వరి పొలాలు

శారదా ఉగ్రరూపం

రాంబిల్లి మండలం రజాల, నారాయణపురం వద్ద గండ్లు

- ఎనిమిది గ్రామాల పరిధిలో 1,500 ఎకరాల్లో నీట మునిగిన వరి
- 100 ఎకరాల్లో ఆనవాళ్లు లేని ఆక్వా చెరువులు
- వై.లోవ గ్రామాన్ని ముంచెత్తిన వరద
- ఇళ్లు, పాఠశాల, దేవాలయాల్లోకి నీరు
- మర్రిపాలెం, రజాల గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్
- శారదా నదిపై ఎన్‌ఏవోబీ నిర్మించిన వంతెనే కారణమని రైతులు ఫిర్యాదు
- కొప్పుగొండుపాలెం వెళ్లి వంతెనను పరిశీలించిన కలెక్టర్
- ఎన్‌ఏవోబీ అధికారులతో చర్చలు





నీటమునిగిన వై.లోవ. (ఇన్‌సెట్‌లో) శారదా నది గట్టుకు పడిన గండి

రాంబిల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో రజాల అగ్రహారం వద్ద మేజర్ శారదా నది, నారాయణపురం వద్ద మైనర్ శారదా గట్లకు గండ్లు పడ్డాయి. దీంతో వరద నీరు సమీపంలో వున్న గ్రామాల్లో వరి పొలాలు, చేపల చెరువులు, కొబ్బరి తోటలను ముంచేసింది. వై.లోవ గ్రామంలోకి వరద నీరు ప్రవేశించింది. సగానికిపైగా వీధులు నీటమునిగాయి. కొన్నిచోట్ల నాలుగు అడుగుల మేర నీరు నిలిచింది. సమాచారం అందుకున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, అధికారులు ఇక్కడకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. శారదా నది నీటి ప్రవాహానికి అడ్డగా ఎన్‌ఏవోబీలో వంతెన నిర్మించారని, దీనివల్ల వరద నీరు సముద్రంలోకి వేగంగా వెళ్లక, వెనక్కు తన్నడంతో గట్లకు గండ్లు పడడంతోపాటు వైలోవ గ్రామం ముంపునకు గురైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'మొంథా' తుఫాన్ ప్రభావంతో మూడు రోజులపాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకుతోడు, ఎగువనున్న రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాల నుంచి పెద్ద మొత్తంలో వరద నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో మంగళవారం నుంచి శారదా నదిలో వరద ప్రవాహం క్రమేపీ పెరుగుతూ వచ్చింది. బుధవారం రాత్రికి వరద ప్రవాహం సుమారు 25 వేల క్యూసెక్కులకు చేరిందని అంచనా. మండలంలో ప్రత్యామ్నాయ నేవల్ బేస్ (ఎన్‌ఏవోబీ) ఏర్పాటు కాకముందు శారదా నదికి ఎంత వరద వచ్చినా.. సాఫీగా సముద్రంలోకి పోయేది. కానీ ఎన్‌ఏవోబీ అధికారులు రక్షణ చర్యల్లో భాగంగా కొప్పుగొండుపాలెం వద్ద శారదా నదికి అడ్డంగా వంతెన నిర్మించి, దాని కింద ఇనుప మెష్ ఏర్పాటు చేశారు. దీంతో నదిలో వరద నీటితోపాటు కొట్టుకు వచ్చే చెట్లు, మొక్కలు, చెత్తాచెదారం ఈ వంతెన వద్ద నిలిచిపోయి నీటి ప్రవాహం మందగిస్తున్నది. ఎగువ నుంచి వచ్చే నీటికన్నా.. సముద్రంలోకి వెళుతున్న నీరు తక్కువ కావడంతో వరద నీరు వెనక్కు ఎగదన్నుతున్నది. బుధవారం రాత్రి నుంచి మేజర్, మైనర్ శారదా నదులు ఉప్పొంగాయి. గురువారం ఉదయానికి పరిస్థితి మరింత తీవ్రతరమైంది. దీంతో రజాల అగ్రహారం పరిధిలో మేజర్‌శారదా, నారాయణపురం వద్ద మైనర్ శారదా నదికి భారీ గండ్లు పడ్డాయి. వరద నీరు పంటపొలాలు, చేపలు/ రొయ్యల చెరువులను ముంచెత్తింది. రజాల, మర్రిపాలెం, కట్టుబోలు, మురకాడ, మర్రిపాలెం, వెల్చూరు, పెదకలవలాపల్లి, వై.లోవ తదితర గ్రామాల్లో సుమారు 1,500 ఎకరాల్లో వరిపంట ముంపునకు గురైయిందని మండల వ్యవసాయాధికారి సుమంత తెలిపారు. ఇంకా వంద ఎకరాల్లో ఆక్వా చెరువులు కొట్టుకుపోయాయి. 50 ఎకరాల్లో కొబ్బరి తోటలు నీట మునిగాయి. ఆక్వా చెరువుల్లో రొయ్యలు, చేపలు కొట్టుకుపోవడంతో సుమారు రూ.10 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఆయా రైతులు వాపోతున్నారు. నదుల గట్లు బలహీనంగా వుండడంతోపాటు నేవల్‌బేస్‌లో కట్టిన వంతెన కారణంగా తాము తీవ్రంగా నష్టపోయామని వరి, ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు.

వై.లోవ గ్రామంలోకి వరద

కాగా మేజర్ శారదా నదిని ఆనుకొని వున్న వైలోవ గ్రామం వరద ముంపునకు గురైంది. సుమారు 30 ఇళ్లు, ప్రభుత్వ... మిగతా 8వ పేజీలో

పైడిపాల శివాలయంలోకి వరద

నీటమునిగిన శివలింగం, నందీశ్వరుడు





ఆలయంలో వరద నీరు. (ఇన్‌సెట్‌లో) గర్భగుడిలో నీట మునిగిన శివలింగం

మాకవరపాలెం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. పైడిపాల గ్రామంలో కొండ గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో జంక్షన్‌లో ఉన్న వాగలింగేశ్వర శివాలయంలోకి వరద పోటెత్తింది. నందీశ్వరునితో పాటు గర్భగుడితో శివలింగం నీట మునిగాయి. రామన్నపాలెం గ్రామంలోకి వెళ్లే ఏలేరు కాలువ వంతెనపై భారీగా నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. జి.కోడూరు గ్రామంలోని పలు ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. తూటిపాలలో చెరువు పూర్తిగా నిండి ప్రమాదకరస్థాయికి చేరడంతో తహశీల్దార్ వెంకటరమణ, సర్పంచ్ ప్రసాద్ ఆధ్వర్యంలో వరద నివారణ చర్యలు చేపట్టారు.

పొంగిన జాగారం గెడ్డ

300 ఎకరాల్లో నీట మునిగిన వరి

- గెడ్డ సమీపంలోని భూముల్లో ఇసుక, మట్టి మేటలు
- గత ప్రభుత్వం పట్టించుకోకపోవడమే కారణమని రైతుల ఆరోపణ



నీట మునిగిన వరి పొలాలు

మాకవరపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. జి.కోడూరు గ్రామంలో జాగారం గెడ్డ వరద పంట పొలాలపైకి విరుచుకుపడింది. దీంతో సుమారు 300 ఎకరాల్లో వరి పంట నీటముని గింది. గెడ్డకు సమీపంలోని భూముల్లో పెద్ద ఎత్తున ఇసుక, మట్టి, రాళ్లు మేటలు వేసినట్టు రైతులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తున్నారు. వైసీపీ అధికారంలో వున్నప్పుడు 2023లో తుఫాన్ సంభవించి భారీ వర్షాలు పడడంతో జి.కోడూరు వద్ద జాగారం గెడ్డకు గండి పడింది. కోత దశలో ఉన్న సుమారు 300 ఎకరాల్లో వరి పంట మొత్తం వదర పాలైంది. గండి పూడ్చాలన్న రైతుల విజ్ఞప్తిని అప్పటి ప్రభుత్వం ... మిగతా 8వ పేజీలో



జాగారం గెడ్డ నుంచి పొలాలపైకి వస్తున్న నీరు

నదుల్లో తగ్గని వరద

పలు గ్రామాల్లో రెండో రోజూ ముంపులోనే వరి పొలాలు

- ధాన్యం దిగుబడిపై రైతుల్లో సన్నగిల్లుతున్న ఆశలు



చోడవరం మండలం గోవాడ వద్ద శారదా నది ఉగ్రరూపం

చోడవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం తగ్గినప్పటికీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు, గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి శారదా, పెద్దేరు నదుల్లో వరద ఉధృతి అధికంగా వుంది. శారదా నది ఒడ్డున ఉన్న భోగాపురంలో రైతులు పంటపొలాల్లోని కల్లాల నుంచి పశువులను ఇళ్లకు తరలించారు. జన్నవరం వద్ద పెద్దేరు నది వంతెనను తాకుతూ ప్రవహిస్తున్నది. వంతెన కింద చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండిపోవడంతో వరద ప్రవాహం వంతెన పైకి వస్తుందేమోనని ఆందోళన చెందారు. అధికారులు ఎక్స్‌కవేటర్‌ను తీసుకువచ్చి వంతెన కింద చిక్కుకున్న చెట్ల కొమ్మలను తొలగించడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా వర్షాలకుతోడు నదుల్లో వరద ప్రవాహం అధికంగా వుండడంతో జన్నవరం, చాకిపల్లి, కన్నంపాలెం, సింహాద్రిపురం, అంకుపాలెం గ్రామాల్లో వరి, చెరకు తోటలు, ఇతర పంటలు నీట మునిగి చెరువులను తలపించాయి. లక్ష్మీపురం చెరువు నిండి, అలుగు పారడంతో నరసయ్యపేట, లక్ష్మీపురం కల్లాల వద్ద వరి పొలాలు నీటమునిగాయి. ఇప్పటికే రెండు రోజుల పాటు నీటమునిగిన వరి పొలాలు మూడో రోజు కూడా ముంపులోనే ఉండిపోతే ధాన్యం దిగుబడి కష్టమేనని రైతులు వాపోతున్నారు.



లక్ష్మీపురం చెరువు పొంగడంతో నరసయ్యపేటలో నీటమునిగిన వరి పొలాలు

మళ్లీ కాజ్‌వే కష్టాలు

విజయరామరాజుపేట వద్ద వరద ఉధృతికి కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డు

- పక్షం రోజుల క్రితం రూ.15 లక్షలతో నిర్మాణం
- తుఫాన్ ధాటికి వరద పాలు



విజయరామరాజుపేట వద్ద కాజ్‌వేకు గండి పడిన దృశ్యం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయరామరాజుపేట వద్ద ఇటీవల నిర్మించిన తాత్కాలిక కాజ్‌వే మరోసారి కొట్టుకుపోయింది. తాచేరు నదిలో వరద ఉధృతి పెరగడంతో బుధవారం అర్ధరాత్రి గండి పడింది. దీంతో బీఎన్ రోడ్డు వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. చోడవరం వైపు నుంచి మాడుగుల, పాడేరు వైపు వెళ్లే వాహనాలను కేజే పురం మీదుగా మళ్లించారు. వడ్డాది, నర్సీపట్నం వైపు వెళ్లే వాహనాలను గౌరీపట్నం రూటులోకి మళ్లించారు. వాస్తవంగా ఈ కాజ్‌వేపై వాహనాల రాకపోకలను బుధవారం ఉదయం నుంచే నిలుపుదల చేశారు. రాత్రికి వరద ఉధృతి పెరగడం, సిమెంట్ తూములకు చెత్తాచెదారం అడ్డుపడడంతో నీరు పొంగి కాజ్‌వే మీదుగా ప్రవహించడంతో కోతకు గురై గండి పడింది. విజయరామరాజుపేట కాజ్‌వే ఈ ఏడాది ఆగస్టులో కొట్టుకుపోగా సుమారు రెండు నెలల క్రితం రూ.15 లక్షలు వెచ్చించి కొత్త కాజ్‌వే నిర్మించారు. ఇప్పుడు అది కూడా కొట్టుకుపోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

పొంగిన శారదా నది.. ముంపులో నారాయణపురం

ఎలమంచిలి/రాంబిల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు తోడు రైవాడ జలాశయం నీరు విడిచిపెట్టడంతో మైనర్ శారదా నది పొంగింది. దీంతో రాంబిల్లి మండలం నారాయణపురం గ్రామం వద్ద గురువారం ఉదయం ప్రధాన రోడ్డు పైనుంచి గ్రామంలోకి వరద నీరు చేరింది. ఇసుక బస్తాలు అడ్డుపెట్టడంతో గ్రామంలోకి వరద నీరు కాస్త తగ్గుముఖం పట్టడంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.


నారాయణపురం గ్రామంలోకి చేరిన వరద నీరు

కుటుంబాన్ని రక్షించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

రాంబిల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు వంతెన సమీపంలోని పామాయిల్ తోటకు కాపలాదారుడిగా పనిచేస్తున్న ప్రసాద్, అతని భార్య, కొడుకు వరద నీటిలో చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న రాంబిల్లి పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని బోటు సాయంతో ఆ కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించారు. పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్,ఎస్ఐ నాగేంద్ర, రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, ఎమ్మెల్యే విజయకుమార్ అభినందించారు.


పామాయిల్ తోటలో చిక్కుకున్న కుటుంబాన్ని బోటులో తీసుకువస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

పొంగిన నదులు.. మునిగిన పంటలు

ఉధృతంగా ప్రవహిస్తున్న మైనర్, మేజర్ శారదా, సర్పా, వరహా నదులు... వరి, మిర్చి, పత్తి పంటలకు తీవ్ర నష్టం... పలు గ్రామాల్లోకి వరద నీరు.. పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే


కోటవురట్ల:.చౌడువాడలో నీట మునిగి వరి పంట


ఎలమంచిలిలో శేషుగెడ్డ ఉధృతిని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రమాకుమారి


రాంబిల్లి: మర్రిపాలెంలో నష్టాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే విజయకుమార్

కోటవురట్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వర్షాలకు మండలంలో సర్పా, వరహా నదులు ఉధృతం ప్రవహిస్తున్నాయి. గురువారం వేకువజాము 3 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. గత మూడు రోజుల కంటే గురువారం 30.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షానికి గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వందిలాది ఎకరాల్లో వరి, మిరప, పత్తి పంటలు నీటిలో నానుతున్నాయి. చెట్లపై ఉన్న పత్తి గుల్లలు తడిసిపోయాయి. పూవ్వు రాలిపోతుంది. దీంతో పెట్టుబడులు కూడా రావని రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. కూరగాయలు తోటల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 120 ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగింది. 80 ఎకరాలు పైగా పత్తి పంటకు నష్టం జరిగింది. మిరప నారు నాట్లు వేసి వారం రోజులు కాలేదని, వర్షాలకు మొక్కలు వాడిపోతున్నాయని రైతులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రజాల వద్ద గండిని పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

రాంబిల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సృష్టించిన బీభత్సాన్ని అంచనా వేసేందుకు మండలంలోని 7 గ్రామాల్లో గురువారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కలిసి సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా కుమ్మరాపల్లి, రజాల గ్రామాల పరిధిలో నదిగట్టు గండిపడిన ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. గండి పడడంతో వందలాది ఎకరాల్లో వరి పంట, చేపలు, రొయ్యిల చెరువులు నీటి ముంపునకు గురై తీవ్ర నష్టం వాటిల్లిందని కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఎమ్మెల్యే విజయకుమార్ వివరించారు. నారాయణపురం వద్ద మేజర్ శారదా రోడ్డు పైనుంచి ప్రవహిస్తుండడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. కొత్తపట్నం సమీపంలో పలువురి పూరిళ్లు నీటి ముంపునకు గురయ్యాయి. దిమిలి, రాంబిల్లి, లాలంకోడూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో తుఫాన్ బాధితులకు అధికారులు అన్నిరకాల సదుపాయాలను కల్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు లాలం భరత్ పలువురు టీడీపీ నేతలతో కలిసి వరద నీటికి ముంపునకు గురైన వైలోవ గ్రామాన్ని, పంట పొలాలు, ఆక్వా చెరువులను పరిశీలించారు. వారి వెంట తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ జయమాధవి, నీటిపారుదల ఈఈ, డీఈలు, జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్. వెంకటరమణ, ఎలమంచిలి అగ్నిమాపక అధికారి డి. రాంబాబు, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, ఎన్‌డీఆర్‌ఎఫ్ గార్డులు ఉన్నారు.

పడిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

ఎలమంచిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం గురువారం పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. సోమలింగపాలెంలో భారీ వృక్షాలు నేలకూలాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా అధికారులు త్వరితగతిని వీటిని తొలగించారు. రామారాయుడుపాలెం వద్ద కల్వర్టు దెబ్బతినడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. మండలంలో నాలుగు విద్యుత్ స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయాయి. షేకిళ్లపాలెంలో ఇంటి ప్రహరీ కూలిపోయింది. గ్రామంలో టీడీపీ నేతలు కొలుకులూరి విజయ్‌బాబు, టీడీపీ నాయకులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, వరహాలరావు పరిశీలించి, గ్రామస్థులకు ధైర్యం చెప్పారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సోమలింగపాలెం, జంపపాలెం, రామారాయుడుపాలెం తదితర ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి.

పొంగిన శేషుగెడ్డ

భారీ వర్షాలకు గురువారం ఉదయం శేషుగెడ్డ పొంగడంతో వరద నీరు పట్టణంలోని ప్రధాన రోడ్డు పైనుంచి ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాఫిక్‌ను పెదపల్లి రోడ్డు మీదుగా మళ్లించారు. ఈ ప్రదేశాన్ని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, అధికారులు పరిశీలించారు.

కూలిన రెండు పెంకిటిళ్లు

నక్కపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. మండలంలో వరి పంట ఎక్కడెక్కడా నీట మునిగిందో అధికారులు అంచనా వేస్తున్నారు. రేబాక గ్రామంలో కొండ పైనుంచి గెడ్డనీరు పొంగి ప్రవహించడంతో గూడుపమ్మ ఆలయం నుంచి రేవెళ్ల గ్రామానికి వెళ్లే రహదారి చెరువులా మారిపోయింది. ఉద్దండపురంలో ఒక పెంకుటిల్లు కూలిపోగా, బాధితులను టీడీపీ నాయకులు గురువారం పరామర్శించారు. జీ జగన్నాథపురంలో ఒక పెంకుటిల్లు, దెబ్బతిన్న రహదారులను వైసీపీ నాయకులు పరిశీలించారు.

వర్షాలకు కూలిన పెంకుటిల్లు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు మండలంలోని మాసాహెబ్‌పేట గ్రామంలో గురువారం పెంకుటిల్లు కూలింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి గోడలు నానిపోయి ఉండడంతో పాటు గురువారం తెలవారుజామున భారీ వర్షం కురవడంతో కంకిపాటి సత్తిబాబు ఇల్లు పడిపోయింది. ఇంట్లో వంట సామాన్లు ధ్వంసమయ్యాయి. కూలిపోయిన ఇంటిని రెవెన్యూ అధికారులు త్రినాథ్, వరహాలు పరిశీలించారు. 50 వేలు ఆస్తి నష్టం వాటిల్లినట్టు తెలిపారు. అదే గ్రామంలో పాక్షికంగా మరో మూడు ఇళ్లు దెబ్బతిన్నట్టు గ్రామస్థులు తెలిపారు.

జలదిగ్బంధంలో పూడిమడక

పొంగిన ఉప్పుటేరు

కడపాలెం రోడ్లపై నుంచి ప్రవహిస్తున్న నీరు

అచ్యుతాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా మండలంలో తీరప్రాంత గ్రామమైన పూడిమడక జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఉప్పుటేరు పొంగడంతో ఉప్పుగల్లీలు మునిగాయి. పూడిమడక గ్రామాన్ని ఆనుకొని 600 ఎకరాల్లో గల ఉప్పు గల్లీలకు సముద్రపు నీటిని అందించడానికి సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఉప్పుటేరు ఉంది. సముద్రానికి పోటు సమయంలో ఉప్పుటేరు ద్వారా వచ్చిన సముద్రపు నీటితో ఉప్పు పండిస్తారు. అయితే ప్రస్తుతం ఉప్పుటేరు పూర్తిగా పూడుకుపోవడంతో భారీ వర్షాలు, తుఫాన్‌లు వచ్చేటప్పుడు గ్రామస్థులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రస్తుతం పూడిమడకలో పరిస్థితి ఇదేవిధంగా ఉంది. గురువారం పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఉప్పుటేరు పొంగడంతో పూడిమడక చుట్టు ఉన్న 600 ఎకరాల్లో గల ఉప్పు గల్లీలు సముద్రంలా మారాయి. దీంతో కడపాలెంతో పాటు మెరైన్ పోలీస్ స్టేషన్‌కి వెళ్లే రోడ్లలో గల కాజ్‌వేల పైనుంచి నీరు పారుతుండడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. కడపాలెం పక్కన గల కొత్తేరు కూడా వర్షపు నీటితో నిండిపోవడంతో గ్రామంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.


సాగరంలా మారిన ఉప్పు గల్లీలు

పొంగిన మెలిపాక కాలువ

» పంట పొలాల్లోకి వరద నీరు

అచ్యుతాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీరం దాటిన తర్వాత కురిసిన భారీ వర్షాలకు మండలంలో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. మండలంలో తిమ్మరాజుపేట, పెదపాడు, జగ్గన్నపేట, ఎర్రవరం, మల్లవరం, ఉప్పవరం, ఎంజేపురం తదితర ప్రాంతాల్లో పంట పొలాలను ముంచేశాయి. మెలిపాక గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో జగ్గన్నపేటలో చెరకు, వరి పంట పొలాలు నీట మునిగాయి. తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ చిన్నారావు, సీఐ నమ్మి గణేశ్ పరిశీలించిన అనంతరం ఎక్స్‌కవేటర్ సాయంతో మెలిపాక కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అలాగే తిమ్మరాజుపేట వద్ద కుల్లకాలువ గట్టు నీటి ప్రవాహ వేగానికి గండి పడేస్థితికి చేరుకుంది. దీంతో సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి భర్త శివ బాపునాయుడు వెంటనే స్పందించి ఇసుక బస్తాలతో కాలువ గట్టు పటిష్టపరిచారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శరగడం రాము, యల్లపు గోవింద్, శరగడం జగ్గప్పారావు, రాము, రామనాయుడు, మల్ల రాము, దాడి రమణబాబు, కర్రి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


జగ్గన్నపేటలో నీట మునిగిన వరి, చెరకు పంటలు


అచ్యుతాపురం: తిమ్మరాజుపేట వద్ద కుల్లుకాలువ గట్టు గండి కొట్టకుండా ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం


ఎలమంచిలి: సోమలింగపాలెంలో టీడీపీ నేతలతో కలిసి ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు


ఎలమంచిలి: రాంబిల్లి మండలం నారాయణపురం గ్రామ ప్రధాన రోడ్డుపై వరద నీరు

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పొటాషియం లోపం లేకుండా చూసుకోవాలి

అనకాపల్లి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భవాని

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరిలో పొటాషియం లోపం లేకుండా చూసుకోవాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బి.భవాని అన్నారు. మండలంలోని సత్యవరం, గుంటపల్లి, మంగవరం, పెదరాంభద్రపురం తదితర గ్రామాలలో గురువారం శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలను శాస్త్రవేత్తలు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో వరి పంట పిలక, అడుగు పొట్ట దశలో ఉన్నాయని, కొన్నిచోట్ల పొటాషియం లోపం గమనించినట్టు తెలిపారు. అడుగు పొట్ట దశలో ఉన్న వరిలో మ్యూరేట్ ఆఫ్ పొటాషియం 20 కిలోలు, యూరియా 20 కిలోలు చల్లుకోవాలన్నారు. పూత దశలో ఉన్నట్టయితే మానుపండు తెగులుకు లీటరు నీటికి ప్రోపకోనజోల్ 1 మిల్లీలీటర్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పొడ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలపాలన్నారు. ఆకుముడత తెగులు సోకితే కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ 2.మిల్లీలీటరు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం తమలపాకు తోటలను పరిశీలించారు. తోటలలో నీరు నిలిచిపోవడంతో తీసుకోవలసిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంజీబీఎస్ కుమారి, ఎం రవి బాబు, ప్రసాదరావు, ఏవో పి.ఆదినారాయణ, ఇన్‌చార్జి ఉద్యానవన శాఖాధికారి సాయిప్రియ, ఏఈవో నాగమణి, సిబ్బంది శరగడం వెంకట అప్పారావు, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు చించలపు ప్రదీప్, యాళ్ల వరహాలు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కంకిపాటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ చిక్కాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


పాయకరావుపేటరూరల్: తమలపాకుల తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలకు జరిగిన నష్టాన్ని వివరిస్తున్న రైతులు

దార్లపూడిలో పర్యటించిన శాస్త్రవేత్తల బృందం

ఎస్.రాయవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడి గ్రామంలో గురువారం కొక్కిరాపల్లి, అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రాల శాస్త్రవేత్తలు పర్యటించి, వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి. భవాని మాట్లాడుతూ వర్షాలకు వరి పంటకు పెద్దగా నష్టం వాటిల్లలేదన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంజీబీఎస్ కుమారి, డాక్టర్ ఎం.రవిబాబు బీసీటీ కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాదరావు, ఏవో సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


ఎస్.రాయవరం: దార్లపూడిలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

ముంపు ప్రాంతాల్లో ప్రగడ పర్యటన

ఎలమంచిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలంతా ధైర్యంగా ఉండాలని, ఎవరూ నిరాశ చెందవద్దని రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన స్థానిక టీడీపీ నేతలతో కలిసి సోమలింగపాలెం గ్రామంలో పర్యటించారు. శారదానది ఉధృతి కారణంగా గ్రామంలోకి వరద నీరు చేరకుండా ఉండేందుకు అధికారులతో కలిసి ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రగడ గ్రామస్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని విధాలా నివారణ చర్యలు చేపట్టిందన్నారు. ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అలాగే గ్రామంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి, తహశీల్దారు వరహాలు, కమిషనర్ ప్రసాదరాజు వరద నీరు గ్రామంలోకి రాకుండా చర్యలు చేపట్టారు. అధికారులంతా గ్రామంలోనే ఉండి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు గొర్లె నానాజీ, ఆడారి ఆదిమూర్తి, ఆడారి రమణబాబు, కర్రి జాన్సీ, కరణం రవి, ఎల్లపు శ్రీను, పందూరి శ్రీను, పట్టణ ఉపాధ్యక్షుడు దంట్ల వెంకట స్వామిలు పాల్గొన్నారు.

పలు ప్రాంతాలలో నిలిచిన నీరు

పాయకరావుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో కురిసిన వర్షాలకు పట్టణంలో పలు ప్రాంతాలలో నీరు నిలిచిపోయింది. లక్ష్మీనగర్‌లో నీరు నిలిచిపోయింది. అదేవిధంగా శ్రీప్రకాశ్ విద్యాసంస్థల సమీపంలో అపార్ట్‌మెంట్ల వద్ద నీరు నిలిచిపోయింది. గురువారం తెలవారుజామున కురిసిన కుండపోత వర్షానికి నీరు నిలిచిపోవడంతో తహశీల్దారు ఎస్ఏ మహేశ్వరరావు, ప్రత్యేకాధికారి జయప్రకాశ్ ఆ ప్రాంతాలను పరిశీలించారు. శ్రీప్రకాశ్ వద్ద కల్వర్టుకు అడ్డంకిగా ఉన్న జనరేటర్‌ను తొలగించి ఎక్స్‌కవేటర్‌తో పూడికను తీయించారు.

మోసయ్యపేట కాలువల్లో పూడిక తొలగింపు

అచ్యుతాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోసయ్యపేట కాలువల్లో పూడికను ఎట్టకేలకు అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. భారీ వర్షాలకు గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గ్రామంలో పరిస్థితిపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ముంపులో మోసయ్యపేట' శీర్షికతో వార్త రావడంతో అధికారులు స్పందించారు. బుధవారం ఉదయం నుంచి ఎక్స్‌కవేటర్‌తో కాలువల్లో పూడిక తీసి అచ్యుతాపురం-ఎలమంచిలి రోడ్డులో గల ప్రధాన కాలువకు అనుసంధానం చేశారు. సర్పంచ్ పంచదార్ల పైడిరాజు, ఉపసర్పంచ్ పుర్రె శ్రీనివాస యాదవ్, కార్యదర్శి ఎస్‌కే శ్రీను దగ్గరుండి పూడిక తీయించారు.

సెక్రటరీలు, సచివాలయాల సిబ్బంది ఆందోళన


ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్యదర్శులు

నక్కపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేటలో తుఫాన్ విధుల్లో ఉన్న సెక్రటరీ కాకర సత్యం సహా సచివాలయ సిబ్బందిపై అదే గ్రామానికి చెందిన కొందరు దౌర్జన్యం చేసి, బెదిరింపులకు గురి చేశారని ఆరోపిస్తూ గురువారం తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఎదుట మండల సచివాలయాల సెక్రటరీలు, సిబ్బంది ఆందోళన చేపట్టారు. వారికి పలు గ్రామాల సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది సంఘీభావం ప్రకటించారు. తమ విధులకు ఆటంకం కల్గించారని సెక్రటరీ సత్యం ఎంపీడీవో సీతారామరాజు, తహశీల్దార్ నర్సింహమూర్తికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతి చిన్న విషయంపై దౌర్జన్యం చేసి భయభ్రాంతులకు గురి చేస్తే రాజయ్యపేటలో పనిచేయలేమని తేల్చి చెప్పేశారు. సీఐ జె. మురళీకి తమను ఎలా ఇబ్బంది పెట్టారో వివరించారు. అందిన ఫిర్యాదు మేరకు ఇదే గ్రామానికి చెందిన పిక్కి తాతయ్యలు, పిక్కి కోటి సహా మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్నిబాబు చెప్పారు.

గ్రామాలలో పారిశుధ్య పనులు

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం పారిశుధ్య పనులను చేపట్టారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు అన్ని పంచాయతీలలో పారిశుధ్య పనులు చేపట్టినట్టు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. శ్రీరాంపురం, సత్యవరం, వెంకటనగరం, పెంటకోట, గోపాలపట్నం, మాసాహెబ్‌పేట, మంగవరం, నామవరం, పెదరాంభద్రపురం, పాల్మన్‌పేట, ఈదటం, పాల్తేరు, తదితర గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో రోడ్లపై చెత్తా, చెదారాలను, డ్రైనేజీలలో పూడికను తొలగించి, వీధులలో బ్లీచింగ్‌ను చల్లించారు.

నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠకు పూజలు

పాయకరావుపేటరూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపట్నం సీతమ్మవారి కొండపై ఉమాధర్మలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పలువురు దంపతులు కంకణధారణ చేసి పీటలపై కూర్చుండగా 11 మంది వేదపండితుల ఆధ్వర్యంలో వివిధ రకాల పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన చేశారు.

నీటి వనరులను క్లోరినేషన్ చేయాలి

నక్కపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని కార్యదర్శులను ఆదేశించినట్టు ఎంపీడీవో డీ సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో కె.చలపతిరావు చెప్పారు. గురువారం సీహెచ్‌ఎల్‌పురంలో మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియను వారు పరిశీలించారు. డ్రైన్ల క్లీనింగ్ పనులు కూడా పరిశీలించారు. ప్రజలంతా కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలని సూచించారు.

తుఫాన్‌ను ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం : ధర్మశ్రీ

మునగపాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం చెందిందని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ విమర్శించారు. స్థానిక ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ మునగపాక మండలంలో యాదగిరిపాలెం, మొలుపాక, గణపర్తి, చూచుకొండ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారని, సహాయక చర్యలు నామమాత్రంగా ఉన్నాయన్నారు. వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం చర్యలు కేవలం ప్రకటనలకే పరిమితంగా ఉందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు స్వామిసత్యనారాయణ, వైసీపీ నాయకుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు పాల్గొన్నారు.

క్లోరినేషన్ తరువాతే తాగునీటిని సరఫరా చేయాలి

ఎస్.రాయవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాగునీటి ట్యాంకులన్నింటిలో క్లోరినేషన్ చేసిన తరువాతే ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలని ఎంపీడీవో పి.మీనాకుమారి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. జేవీపాలెం, సైతారుపేట, సర్వసిద్ధి, ధర్మవరం అగ్రహారంల్లో గురువారం ఆమె డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి పర్యటించారు. అనంతరం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీనాకుమారి మాట్లాడుతూ ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు.

వర్షం నీరు విషయమై వృద్ధుడిపై కత్తితో దాడి

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాహెబ్‌పేటలో గురువారం బంటుపల్లి అయ్యారావుపై అదే గ్రామానికి చెందిన తిరంశెట్టి సత్యనారాయణ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. పక్క పక్క ఇళ్లలో నివాసం ఉంటున్న ఇద్దరికీ వర్షం నీరు వెళ్లే మార్గం విషయమై వివాదం జరిగింది. దీంతో సత్యనారాయణ కత్తితో అయ్యారావుపై దాడి చేసి గాయపరిచాడు. తుని ప్రభుత్వాసుపత్రిలో అయ్యారావు చికిత్స పొందుతున్నాడు. దాడి విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సీఐ అప్పన్న తెలిపారు.


అనకాపల్లి దిబ్బవీధిలో రోడ్డుపై నిలిచిపోయిన వర్షపునీరు


సబ్బవరం మండలం రావలమ్మపాలెం పెద్ద చెరువులో..


నీటితో కళకళలాడుతున్న పరవాడ పెద్ద చెరువు

ఎండ.. అంతలోనే వాన..

- తుఫాన్ తీరం దాటినా పలు మండలాల్లో కొనసాగిన వాతావరణం
- చెరువులను తలపిస్తున్న పలు రోడ్లు, పంట పొలాలు
- రాకపోకలకు జనం అవస్థలు
- తగ్గిన 'శారదా' ఉధృతి
- పలు గ్రామాల్లో నాయకులు, అధికారులు పర్యటన


అనకాపల్లిలో ప్రవహిస్తున్న శారదానది

అనకాపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ తీరం దాటినా ఇంకా పలు మండలాల్లో ముసురు వీడడం లేదు. అడపా దడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఆ క్షణంలోనే వర్షం.. అంతలోనే చుర్రుమనిపించేలా ఎండ కాస్తుండడంతో జనం బేజారెత్తిపోతున్నారు. గురువారం తెల్లవారుజాము ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు ఎడతెరిపి లేకుండా అనకాపల్లి పరిసర మండలాల్లో వర్షం కురిసింది. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువును తలపించింది. గవరపాలెం దిబ్బవీధిలోని రహదారిలో నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముసురు కారణంగా చిరు వ్యాపారులు వ్యాపారాలు సాగక అవస్థలు పడుతున్నారు.

శాంతించిన 'శారదా'.. నీట మునిగిన శివాలయం ఆవరణ

అనకాపల్లి టౌన్ : రైవాడ జలాశయం నీటి విడుదల కారణంగా గత రెండు రోజులుగా ఉప్పొంగి ప్రవహించిన శారదా నది గురువారం నాటికి కొంత వరకు శాంతించింది. బుధవారం అర్ధరాత్రి వరకు నది ప్రవాహం భారీగా ఉంది. అర్ధరాత్రి సమయంలో ప్రవాహం ధాటికి నదికి ఆనుకొని ఉన్న ఉమా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలోకి వరద నీరు చొచ్చుకు వచ్చింది. అయితే వరద ఉధృతి గురువారం ఉదయానికి కొంతమేర తగ్గడంతో ఆలయ నిర్వాహకులు ఆలయ ఆవరణలో నిలిచిపోయిన వరదనీటిని నదిలోకి మళ్లించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నదిని సందర్శించారు. నీటి ఉధృతిని పరిశీలించి భవిష్యత్తులో ఎవరూ ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తికి సూచించారు. అలాగే నిమజ్జన ఘాట్ అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కూడా శారదా నదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ చక్రవర్తితో పాటు జీవీఎంసీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీటితో అధ్వానంగా ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. ఆర్టీసీ అధికారులు, జీవీఎంసీ కమిషనర్‌తో చర్చించి త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. డీపీటీవో వి.ప్రవీణ, డిపో మేనేజర్ హనుమశ్రీ, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 670 హెక్టార్లలో పంట నష్టం : ఎమ్మెల్యే


వెంకుపాలెం వెదుళ్ళ గెడ్డను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్ : తుఫాన్ ప్రభావం కారణంగా నియోజకవర్గంలో 670 హెక్టార్ల వరకు పంట నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనాలుగా తెలుస్తోందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. శారదా నది ఒడ్డున ఆయన మీడియాతో మాట్లాడారు. వర్షాలు తగ్గిన తరువాత అధికారులు పంట పొలాలను పరిశీలించి రెండోసారి అంచనాలను తయారు చేస్తారని పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావం కారణంగా ఎక్కడ ఎటువంటి నష్టం జరగలేదన్నారు. మూడు రోజుల పాటు శారదానది ఉధృతంగా ప్రవహిస్తున్నా నది పరీవాహక ప్రాంతాల గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంలో అన్నిశాఖల యంత్రాంగం చక్కని ప్రతిభ కనబరిచారని అభినందించారు.

ముంపు ప్రాంతాల్లో నాయకుల పర్యటన

కొత్తూరు : తుఫాన్ కారణంగా ముంపునకు గురైన మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం నాయకులు పర్యటించారు. వెంకుపాలెంలోని వెదుళ్ళ గెడ్డను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా గెడ్డ పొంగడానికి గల కారణాలను రైతుల ద్వారా తెలుసుకున్నారు. వర్షం వస్తే ఎగువ నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడమే కాకుండా వెంకుపాలెం, సుందరయ్యపేట, వెంకుపాలెం నుంచి కుంచంగి వెళ్లే రహదారి పూర్తిగా స్తంభించిపోతుందని రైతులు వివరించారు. గెడ్డ పొంగడం వల్ల పక్కనే ఉన్న వరి, చెరకు తదితర పంట పొలాలు పూర్తిగా జలమయమైపోతాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే కొణతాల మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం వచ్చేలా చూస్తామన్నారు. ఆయన వెంట గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, కూటమి నాయకులు ఉన్నారు. అలాగే, సత్యనారాయణపురం దొంగ గెడ్డను మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు పరిశీలించారు. గెడ్డలో వర్షపు నీరు స్తంభించపోవడంతో పంచాయతీ పారిశుధ్య సిబ్బంది, ఎక్సకవేటర్ సహాయంలో చెత్త, చెదారాన్ని తొలగించి ఆ నీరు శారదానదిలోకి వెళ్లేవిధంగా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కొత్తూరు సర్పంచ్ సప్పారపు లక్ష్మీప్రసన్న, టీడీపీ నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, బర్ల నాగరాజు, మాజీ ఎంపీటీసీ కోన శ్రీనివాసరావు, వర్మ, మేడిశెట్టి నూకరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : మండలంలోని శంకరం, కొప్పాకలలో నీట మునిగిన ఆవఖండం భూములను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. అధికారులతో నీట మునిగిన పంటలకు సర్వేచేయించి, నష్ట పరిహారం అందేలా చూస్తామని అక్కడి రైతులకు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టంపై నివేదిక అందజేయండి : ఎమ్మెల్యే

కశింకోట : మొంథా తుఫాన్ వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి, నివేదికను వెంటనే ఇవ్వాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వ్యవసాయాధికారులను ఆదేశించారు. మండలంలోని దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాలైన జోగారావుపేట, వెదురుపర్తి తదితర గ్రామాల్లో మునిగిపోయిన వరి పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. అనంతరం మండల ప్రత్యేకాధికారిణి వి.లక్ష్మీసుభాషిణితో శారదా నది పరీవాహక ప్రాంతాల్లో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, కూటమి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, కర్రి సత్యనారాయణ, కలగ సోమేశ్వరరావు, గంగయ్య, బలిజ ముసిలినాయుడు ఆయన వెంటన ఉన్నారు. అలాగే, కశింకోటలోని హౌసింగ్ కాలనీని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ సందర్శించారు. కాలనీలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైన సంగతి తెలుసుకొని పర్యటించారు. టీడీపీ నాయకులు వేగి పాపారావు, వేగి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సాగునీటి చెరువులకు జలకళ

పరవాడ/సబ్బవరం : తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో పరవాడ, సబ్బవరం మండలాల్లోని పలు ప్రధాన సాగునీటి చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది వర్షపాతం ఎక్కువగా నమోదు కావడంతో చెరువుల్లో నీరు సమృద్ధిగా చేరింది. ఖరీఫ్, రబీ సీజన్‌లకు సరిపడినంత నీరు నిల్వలు ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మండల కేంద్రం పరవాడ పెద్ద చెరువు, పైడమ్మ బంద చెరువు, కలపాక ఎర్ర చెరువు, సన్యాసయ్య చెరువు, ఊర చెరువు, రావాడ నల్లచెరువు, గొర్లివానిపాలెం చెరువు, పి.బోనంగి చెరువు తదితరాలను జలకళను సంతరించుకున్నాయి. అలాగే, సబ్బవరం మండలంలోని భూదేవి చెరువు, రావలమ్మపాలెం పెద్ద చెరువు, మలునాయుడుపాలెం మావూళ్ల చెరువు, గొల్లలపాలెం రాజ్‌చెరువు, గొటివాడ సూపరపురాజ్ చెరువు, యాతపాలెం ధర్మసాగరం తదితర అతిపెద్ద సాగునీటి చెరువులన్నీ నిండుకుండను తలపిస్తున్నాయి. అదేవిధంగా ఆరిపాక పెద్ద గెడ్డ, టిక్కలిపాలెం, గొటివాడ పరిధిలోని ఉప్పు గెడ్డ, ఆల్లి గెడ్డ, ఉప్పుగెడ్డ, ఆదిరెడ్డిపాలెం గెడ్డ, బొర్రమ్మ గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వచ్చే రబీ సీజన్‌కు ఈ చెరువులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నదాతలు చెపుతున్నారు.

నీట మునిగిన పంట పొలాలు


అనకాపల్లి మండలం వెంకుపాలెంలో ముంపునకు గురైన వరి పంట

కొత్తూరు : తుఫాన్ కారణంగా లోతట్టు ప్రాంతాలైన అనకాపల్లి మండలం వెంకుపాలెం, సీతానగరం, కుంచంగి గ్రామాల్లో వరి పంట నీటిమునిగింది. సుమారు 300 ఎకరాల్లో తీవ్ర పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. మరో నెల రోజుల్లో చేతికొచ్చే పంట నీటిపాలు కావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల పూర్తిగా ముంపునకు గురైంది. క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు పర్యవేక్షించి పరిహారం అందజేయాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

కూండ్రం ఎస్సీ కాలనీలో వర్షపు నీరు తిష్ఠ

కూండ్రం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇళ్ల ముందు వర్షపు నీరు నిలిచిపోయింది. ప్రధానంగా ఈ కాలనీలో కాలువలు లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడల్లా ఇటువంటి సమస్యను స్థానికులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఇళ్లలోంచి అడుగు బయట పెట్టలేని స్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే తమ సమస్యపై స్పందించాల్సిందిగా కోరారు.

తుమ్మపాల : తుఫాన్ ప్రభావంతో అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ప్రధానంగా తుమ్మపాల, మార్టూరు, ఆవఖండం, వెంకుపాలెం, కుంచంగి తదితర గ్రామాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ఈ మేరకు గురువారం మండల వ్యవసాయాధికారి రంగాచారి పరిశీలించారు. మండలంలోని 17 గ్రామాల్లో వరి పొలాలు నీట మునిగినట్లు ప్రాథమిక అంచనా చేశామన్నారు. 1423 మంది రైతులకు సంబంధించిన దాదాపు 1400 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు అంచనా వేశామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్ధారించడం జరుగుతుందన్నారు.

చెరువులా ఉగ్గినపాలెం జాతీయ రహదారి

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం జాతీయ రహదారిపై వర్షపునీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోంది. ఈ ప్రాంతంలో సరైన డ్రైనేజీలు లేకపోవడం వల్ల నీరు రోడ్డుపై తిష్ఠ వేస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారిని ఆనుకొని వేసిన సర్వీసు రోడ్డు కూడా పూర్తిగా నీటితో మునిగిపోయింది. ప్రధాన రహదారి కావడంతో పంటల పొలాల నుంచి వర్షపునీరు రోడ్డుపైకి చేరి ఎలమంచిలి నుంచి అనకాపల్లి జాతీయ రహదారి జలమయమైంది. తాళ్లపాలెం నుంచి ఉగ్గినపాలెం వచ్చే సర్వీసు పూర్తిగా మునిగింది.

వెదురుపర్తిలో నది గట్టు కోతకు గురికాకుండా చర్యలు

కశింకోట మండలంలోని వెదురుపర్తిలో శారదానది ఎడమ గట్టును పటిష్ఠ చేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. రైవాడ గేట్లు ఎత్తివేసే క్రమంలో శారదా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో గురువారం ఉదయం వెదురుపర్తి గ్రామంలో ఎడమ వైపు గట్టు బలహీనపడుతుందని స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మీసుభాషిణి, తహశీల్దార్ తిరుమలరావు, అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐ అల్లు స్వామినాయుడులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. వెంటనే సిమెంటు బస్తాలతో శారదా గట్టును పటిష్ఠవంతంగా తయారు చేసి గ్రామస్థులకు మరింత భద్రత కల్పించారు.

శారదా నదికి పసుపు, కుంకుమలు సమర్పణ

అనకాపల్లి టౌన్, : గంగమ్మా.. శాంతించమ్మా..అని వేడుకుంటూ జీవీఎంసీ 82వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి పోలారపు త్రినాథరావు ఆధ్వర్యంలో పలువురు శారదా నదికి గురువారం సాయంత్రం పసుపు, కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. నాలుగు రోజులుగా కుండపోత వర్షాలు, రైవాడ నీటి ప్రవాహంతో శారదా నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా సురక్షితంగా ఉండేలా కాపాడాలని శ్రీరామనగర్ కాలనీ వద్ద శారదా నదిలో గంగమ్మకు పూజలు చేశారు.


శారదా నది ఎడమ గట్టు పటిష్ఠానికి ఇసుక బస్తాలు వేస్తుయిన్న పోలీసులు

'వెదుళ్ళగెడ్డ ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలి'


వెదుళ్ళగెడ్డను పరిశీలిస్తున్న పోలీసులు, గ్రామస్థులు

కొత్తూరు, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కుంచంగిలోని వెదుళ్ళగెడ్డలో భారీ వచ్చి చేరుతోందని, ఈ ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రవికుమార్ సూచించారు. గురువారం రాత్రి కుంచంగి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వెదుళ్ళగెడ్డ నీటి ప్రవాహాన్ని కలిసి పరిశీలించారు. నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడం వల్ల గండి పడకుండా ఇసుక బస్తాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం నాయకుడు పోలిన సూర్యజగ్గారావు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

చిన్నయ్యపాలెం రింగు రోడ్డు వద్ద వరద సమస్యకు అడ్డుకట్ట

సబ్బవరం : మండలంలోని చిన్నయ్యపాలెం వద్ద విశాఖ- రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణంలో భాగంగా చేపడుతున్న రింగ్ రోడ్డు (ఇంటర్ ఛేంజ్) పని ప్రదేశంలో వరద నీటి ముంపునకు అడ్డుకట్ట వేశారు. ఈ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పర్యటించారు. వరద నీటి వల్ల ఇక్కడ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నందున వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని వారు ఆదేశించారు. దీంతో గురువారం తహశీల్దార్ బి.చిన్నకృష్ణ, సీఐ రామచంద్రరావు దగ్గరుండి ఎక్సకవేటర్ సాయంతో పనులు పూర్తి చేయించారు. అదే విధంగా చిన్నయ్యపాలెం సమీపంలో సర్వీసు రోడ్డులో వరద నీటిని తొలగించారు.

'ఫార్మా పరిశ్రమలకు నిరంతరం విద్యుత్ ఇవ్వాలి'

పరవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా పరిశ్రమలకు నిరంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు కోరారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండడంతో ఆయా యాజమాన్యాలు జనరేటర్లపై ఉత్పత్తి కార్యకలాపాలు నిర్వహించుకోవాల్సి వస్తుందన్నారు. దీనివల్ల యూనిట్ విద్యుత్ రూ.తొమ్మిది నుంచి రూ. 30 వరకు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఇది గుర్తించి ఫార్మాసిటీకి నిరంతరం విద్యుత్‌ను సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వీవీ శ్రీనివాసరావు, ఫార్మాసిటీ సాఫ్ట్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి పుస్తక మహోత్సవం వాయిదా

అనకాపల్లి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం జరగాల్సిన అనకాపల్లి పుస్తక మహోత్సవాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుత వాతావరణం పరిస్థితుల కారణంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. త్వరలోనే తేదీని ప్రకటిస్తామని ఆయన వివరించారు.

గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని పంట నష్టం అంచనా వేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి టౌన్ : తుఫాన్ బాధితులను తక్షణమే ఆదుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం కోరారు. గురువారం ఇక్కడ జరిగిన సమావేశంలోమాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి తుఫాన్ కారణంగా ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యంగా పంట పొలాలు నీట మునిగాయన్నారు. పంట భూములకు, వృత్తిదారులకు, దళితులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలు, అసంఘటితరంగ కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని పంట నష్టం అంచనా వేయాలని సూచించారు. ఇళ్లు కోల్పోయిన వారికి మరలా నిర్మించుకునేందుకు సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. పంట నీటమునిగిన రైతులకు ఎకరాకు రూ.50వేలు చొప్పున పరిహారం అందించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు జి.కోటేశ్వరరావు, డి.వెంకన్న, ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముంపు పొలాల్లో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

- రైతులకు వ్యవసాయ, ఉద్యానవన శాస్త్రవేత్తల సూచన


అసకపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త కెవీ రమణమూర్తి తదితరులు

సబ్బవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో ముంపునకు గురైన పంట పొలాల్లో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త కేవీ రమణమూర్తి సూచించారు. మండలంలోని పైడివాడ అగ్రహారం, అసకపల్లి గ్రామాల్లో గురువారం పర్యటించి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపునకు గురైన పొలాల్లోని నీటిన దిగువకు పంపాలన్నారు. కొన్ని గ్రామాల్లో వరి పంట పొట్ట దశలో ఉన్నందున నష్టం ఏమీ జరగలేదన్నారు. అయితే వర్షం తగ్గిన వెంటనే తెగుళ్ల ప్రబలే అవకాశం ఉన్నందున వరి పైరుపై ప్రొఫికొనజోల్ 200 ఎంఎల్ లేదా కార్బండిజం రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. నీట మునిగిన పొలాల్లో బూస్టర్ డోస్‌గా ఎకరాకు 15 కిలోల యూరియా, 20 కిలోల పొటాషియం చొప్పున జల్లుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజు, ప్రోగ్రాం కో -ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, వీఏఏ ఆలేఖ్య, రైతులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, అమృతపురంలో ఉద్యాన పంటలను ఉద్యాన అధికారిణి కిర్మణ్మయి పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. సాధ్యమైనంత త్వరగా పొలాల్లో చేరిన నీటి దిగువకు తరలించాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే కలుపును తొలగించి యూరియా వంటి పోషకాలు పిచికారీ చేయాలని సూచించారు. వర్షాల వలన ఎండు తెగులు ఆశించే అవకాశం ఉందని వివరించారు. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటిలో లేదా మెటలాక్సిల్ మరియూ మాంకోజెబ్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కలు మొదల్లో పోయాలన్నారు. బాక్టీరియా ఆకుమచ్చ తెగుళ్ల ఆశించే అవకాశం ఉన్నందున 10 లీటర్ల నీటిలో 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మరియూ ఒక గ్రాము స్ట్రెప్టో సైక్లిన్ కలిపిన ద్రావణం పిచికారీ చేయాలని వివరించారు. ఆకు మచ్చ, బూడిద తెగులు ఆశిస్తే కార్బిండిజం ఒక గ్రాము లీటరు నీటిలో లేదా మాంకోజెబ్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.


పాడేరు మండలంలో పొలాల్లో ముదుకుల లోతులో వరద నీరు


కోతకుగురైన చౌడుపల్లి కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎంపీపీ అనుషదేవి, జెడ్పీటీసీ, ఏఈఈ తదితరులు


డోకులూరులో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

తుఫాన్ మిగిల్చిన నష్టం

- నీట మునిగిన పొలాలు.. రోడ్లు, వంతెనలు ఛిద్రం
- పొంగుతున్న వాగులు, వంకలు
- గిరి పుత్రుల కష్టాలు

కొయ్యూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు వరి, ప్రత్తి సాగుకు అపార నష్టం చేకూరింది. అపరాల సాగుపై తుపాను ప్రభావం పడింది. అయితే, పంట నష్టాలను అంచనా వేయడంలో సంబంధిత వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో చర్యలు లేకపోవటంతో రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. మండలంలో సుమారు 3 వేల ఎకరాలకుపైగా పత్తి సాగయింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించటంతో కొన్ని పంచాయతీలలో లాభాలు వచ్చే పరిస్థితి ఉండడంతో రైతాంగం ఆశతో ఉండేది. పంట పూత పిందె దశలో ఉండగా తుఫాన్ రావటం పత్తి పేల్చే దశలో ఉన్న కాయ రంగు మారటంతోపాటు రాలిపోతుంది. ఇక పూత వర్షాలకు పూర్తిగా రాలిపోయింది. ఊటతేరి బారిన పడి పత్తి మొక్కల ఆకులు ఎర్రపడ్డాయి. ఇక వరి చేలు పొట్ట, వెన్ను పాలుపోసుకునే దశలో నేలకొరిగాయి. ఎక్కువగా రావణాపల్లి, శరభన్న పాలెం నల్లగొండ తదితర పంచాయతీలలో ఈ పరిస్థితి నెలకొంది. బూదరాళ్ళ, మఠం భీమవరం, యు. చీడిపాలెం పంచాయతీలలో కొండవాగు ప్రవాహాలు ఆనుకుని ఉన్న పొలాల్లో ఇసుకమేటలు వేశాయి. ఈ విషయమై మండల వ్యవసాయశాఖాధికారి బి. రాజకుమార్‌ని సంప్రదించగా పంట నష్టం పెద్దగా ఏమీ లేదని, నిబంధనల మేరకు 33 శాతం నష్టం జరిగితేనే పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఈ నేపథ్యంలో యు. చీడిపాలెంలో రెండు, మూడు ఎకరాలు, బూదరాళ్ళలో రెండు మడులకు నష్టం జరిగినట్టు గుర్తించామన్నారు. పత్తి నష్టాలపై పరిశీలిస్తామన్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యవసరాలు వితరణ

కొయ్యూరు: రావణాపల్లి పంచాయతీ రేవడివీధి గ్రామానికి చెందిన మాదల గంగరాజుతఫాన్ బాధితులకు స్థానిక లోగులగాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసరాలు అందజేశారు. తాటాకి ఇల్లు పూర్తిగా నేలకూలడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురొంటున్నారు. ౧ బియ్యం, పప్పులు నగదును అందజేశారు. అలాగే దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి డివిడి ప్రసాద్ బాధిత కుంటుబానికి రగ్గులు, చీరలు పంపిణీ చేశారు. ట్రస్ట్ ప్రతినిధి కిరణ్, బీజేపీ నాయకుడు, ఎస్.శివకుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ చంద్రరావు, పాడేరు ఏఎంసీ చైర్‌పర్సన్ ఎం.మంగమ్మ, డి. పద్మరాజు, ఎం.శ్రీను, పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా చౌడుపల్లి బ్రిడ్జి

చింతపల్లి: చౌడుపల్లి-చింతపల్లి మార్గంలో ఆర్ఎఆర్ఎస్‌కి సమీపంలో నున్న వంతెన ప్రమాదబరితంగా తయారైంది. ఈ బ్రిడ్జికి ఒకవైపు నెల రోజుల క్రితం చిన్నపాటి రంధ్రం ఏర్పడింది. ప్రస్తుతం మొంథా తుఫాను భారీగా కోతకుగురైంది. ఈమార్గంపై ప్రయాణించే ద్విచక్రవాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నది. దీంతో గురువారం స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు బ్రిడ్జిని పరిశీలించి పంచాయతీరాజ్ ఏఈఈ బాలకిశోర్‌కి సమాచారం ఇచ్చారు. ఏఈఈ కోతకు గురైన ప్రాంతంలో కర్రలుపాతి ఎర్రని గుడ్డలు కట్టాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి బ్రిడ్జి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిలిచిన రాకపోకలతో..గిరిజనులు ఇక్కట్లు

దుంబ్రిగుడ: మొంథా తుఫాను ప్రభవంతో గిరిజనులకు ఇక్కట్లు తప్పలేదు. తుఫాను ప్రభవంతో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో గెడ్డల, వాగులు ఉధృతతో ప్రహహిస్తున్నాయి. అవతలి గ్రామాల గిరిజనులకు రాకపోకలు నిలిచిపోయాయి. మొంథా తుఫాను ప్రభావం బుధవారం రాత్రి తీరం దాటినప్పటికీ గిరిజన గ్రామాల్లోని గెడ్డలు,వాగులు వరద ఉధృతితో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రానికి ఆనుకోని కితలంగి పంచాయతీ పరిధి గ్రామాలకు రహదారిలోని కితలంగి కాజ్వే ఉధృతి గురువారం మధ్యహ్నాం వరకు ఉధృతి తగ్గలేదు. ఆయా పంచాయతీ పరిధి గిరిజన గ్రామాల గిరిజనులు కాజ్వేగుండ ప్రయాణించేందుకు సాహసం చేయలేక కాజ్వే వద్దనే సాయంత్రం వరకు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు కించుమండ పంచాయతీ కంభవలస గ్రామానికి చెందిన కోర్రా రాములు అనే గిరిజనురాలు అరకు ఏరియా ఆసుపత్రిలో సోమవారం పురిటీ నోప్పులతో చేరుకుంది. అక్కడ వైద్య పరీక్షలు పూర్తీ చేసుకుని మొదటీ కాన్పుగా సుఖ ప్రసాన్ని పొందారు. వైద్య పరీక్షలు అనంతరం ఆసుపత్రి నుంచి గురువారం స్వాగ్రామానికి బాధిత బాలింతరాలను చేర్చేందుకు వాహనాన్ని ఏర్పాటు చేశారు. మార్గమధ్యలోని కితలంగి కాజ్వే ఉధృతితో ప్రవహించడంతో సంబధిత వాహనం బాలింతరాలిని నిలిపివేసింది. బాధిత బాలింతరాలు కుటుంభీకులతో కాజ్వే ఉధృతి తగ్గేవరకు సుమారు రెండు గంటలపాటు వేచి ఉండి స్వగ్రామానికి చేరుకున్నారు.

పాడేరు మండలంలో 150 హెక్టార్లలలో నష్టం

పాడేరురూరల్: మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురవడంతో సుమారు 150 హెక్టార్లలో పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. వనుగుపల్లి పంచాయతీ పరిధిలోని బంధపొలం, తామరాపల్లి, కరకపుట్టు గ్రామాల్లో వరి పొలాలు నీటిలో ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు.

బాధితులకు అండగా ఉంటాం: టీడీపీ నేత

పాడేరురూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు అండగా ఉంటామని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా


గొడ్డుబూసులులో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు


బాధితులను ధారకొండ పునరావాస కేంద్రం నుంచి తోకరాయి కి తరలిస్తున్న దృశ్యం


పాడేరుమండలం పామిరెల్లిలో నిత్యావసరాలు అందిస్తున్న టీడీపీ నాయకుడు సురేష్‌కుమార్


కొయ్యూరు మండలంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

వెంకట సురేష్ కుమార్ తెలిపారు. మండలంలో పర్యటించినట్టు తెలిపారు. గుత్తులపుట్టు పంచాయతీ పామిరెల్లి గ్రామంలో నిరాశ్రయురాలైన బొండా కొండమ్మను గురువారం పరామర్శించారు. బియ్యం, కూరలు, నూనె తదితర నిత్యావసరాలు అందించారు. బాధితులను కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుంటుందని ఆమెకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేవీ ప్రసాద్, టి.మూర్తిబాబు, వి.రమేశ్, సత్తిబాబు, రాము పాల్గొన్నారు.

41 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

గృహాలు దెబ్బతిని గత రెండు రోజులుగా పురావాస కేంద్రాల్లో తలదాచుకున్న 41 కుటుంబాలకు చెందిన బాధితులకు గురువారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశామని తహసీల్దార్ డి.అరుణ్ చంద్ర తెలిపారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు కిలో కందిపప్పు, పంచదార, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, లీటరు ఆయిల్‌ను అందించామన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గడంతో పురావాస కేంద్రాల్లో ఉన్న బాధితులు వారి నివాస గృహాలకు వెళ్లారని తెలిపారు. వర్షాలకు మండలంలోని వివిధ పంచాయతీల్లో 102 గృహాలు దెబ్బతిన్నట్లు ఇంత వరకు గుర్తించామన్నారు. పంట నష్టంపై సిబ్బంది అంచనాలను తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో 24 గంటలు విధులను సక్రమంగా చేపట్టిన కార్యాలయ సిబ్బంది, వీఆర్‌వోలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టమ్మ, రెవెన్యూ సిబ్బంది బజ్జంగి నల్లన్న, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

బాధితులకు గృహాలు మంజూరు చేయాలి: సీపీఎం

తుపాన్‌కు నివాస గృహాలను కోల్పోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గృహాలను మంజూరు చేసి పేద గిరిజనులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి డోకులూరు, జి.ముంచంగిపుట్టు పంచాయతీ పరిధిలోని గ్రామాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు పంచాయతీలలో 5 నివాస గృహాలు ధ్వంసమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.దాసు, ఎస్.చిట్టిబాబు, జి.ముంచంగిపుట్టు సర్పంచ్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ


అనంతగిరి మండలం బొర్రాలో కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్, తదితరులు

అనంతగిరి:మండలంలోని మొంథా తుఫాన్‌లోని నష్టపోయిన బాధితులకు అండగా నిలవాలని జడ్పీటీసీ దీసరి గంగరాజు పిలుపునిచ్చారు. వంట్లమామడి, చప్పాడి గ్రామస్థులకు బొర్రా పాఠశాలలోని ఏర్పాటు పునరావస కేంద్రానికి స్థానిక సర్పంచ్ అప్పారావుతో కలిసి ఆయన పరామర్శించారు. గిరిజనులతో మాట్లాడి, ధైర్యం చెప్పారు. అక్కడ నుంచి బొర్రా హోటల్స్ వద్ద గోస్తనీ ప్రవహానికి ఇళ్లు కోల్పోయిన రెండు కుటుంబాలను పరామర్శించారు. టోకూరు పంచాయతీ బోడగుడ, చిట్టంపాడు, బలియగుడలోని పొలాలను సర్పంచ్ కిల్లో మోస్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నర్సన్న, సారా దొన్ను, దేవన్న, మధు, గుండు, తదితరులు పాల్గొన్నారు.

78 ఇళ్లు...

మండలంలోని 24 పంచాయతీలోని 72 పూరిళ్లు పాక్షికంగా దెబ్బతినగా.. పశువుల పాక ఒకటి, ఒక ఇళ్లు పూర్తిగా నేలమట్టమైనట్టు తహసీల్దార్ వీరభద్రచారి వివరించారు. అలాగే పక్కా భవనాలు మూడు పూర్తిగా పడిపోగా. ఒకటి పాక్షికంగా దెబ్బతిందన్నారు. బొర్రా, కొత్తూరు, గుమ్మకోట కరకవలస, రొంపల్లి పెదరాభలోని పునరావాస కేంద్రాల ద్వారా వంట్లమామిడి, చప్పాడి, బొర్రా, కొత్తూరు, కరకవలస నుంచి 167 మందికి వసతి సౌకర్యం కల్పించామన్నారు. మండలంలోని రాగి 15 ఎకరాలు, వరి 24 ఎకరాలు ముప్పువాటిల్లినట్టు వ్యవసాయశాఖ అధికారి రంగరావు తెలిపారు. పూర్తి వివరాలు రావాల్సి ఉందన్నారు. ఎకరానికి 33 శాతం నష్టం ఉంటేనే వివరాలను నమోదు చేస్తామని వివరించారు.

ఘాట్ రోడ్డు భయం.. భయం

అరకులోయ: మొంథా తుఫాన్ ప్రభావం మండలంలో తగ్గుముఖపట్టింది. మూడు రోజులుగా వర్షాలకు ఆర్టీసీ సర్వీసులు నిలిపివేశారు. అయితే, గురువారం కూడా పలుచోట్ల కొండల పైనుంచి వర్షం రోడ్లపై నుంచి ప్రవహిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలు జారి పడిపోయే ప్రమాదం ఉంటుందని భావించిన అధికారులు ఘాట్ రోడ్డులో బస్సులతో పాటు భారీ వాహనాలను నిలిపివేశారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దఫదఫాలుగా ఓ మోస్తరు వర్షం పడింది.

బాధితులను స్వ గ్రామాలకు తరలింపు..

సీలేరు: వర్షాలు తగ్గుముఖపట్టడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ధారకొండ, సప్పర్ల పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న తోకరాయి, చట్రాపల్లి గ్రామాలకు బాధితులను వాహనాల్లో గురువారం వారి ఇళ్లకు తరలించామని జీకేవీధి తహసీల్దార్ అన్నాజీరావు తెలిపారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంతో 32 ఇళ్లకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. తోకరాయి గ్రామంలో 67 కుటుంబాలు, వారికి రైతుల వద్ద నుంచి 4 ఎకరాల భూ మిని సేకరించామని, అలాగే, చట్రాపల్లిలో 37 కుటుంబాలకు సమీపంలోని ఆర్వోఎఫ్ఆర్ ల్యాం డ్ పరిశీలించామమన్నారు. గురువారం మండలానికి వచ్చిన ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీఓ శ్రీపూజ ఈ విషయాలు వివరించామన్నారు. సాధ్యమైనంత త్వరలో మోడల్ కాలనీ నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. ఈ గ్రామాల గిరిజనులకు డీఆర్ డిపోల ద్వా రా నిత్యావసర సరుకులను అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జి.మాడుగుల: తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన పొలాల్లో సస్యరక్షణ చర్యలు పాటించాలని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు చింతపల్లి ఏడీఆర్


కొయ్యూరు మండలంలో నేలకొరిగిన వరి చేలు

డా.అప్పలస్వామి, జోగారావు, బాలహంసేన్ వరప్రసాద్ రైతులకు సూచించారు. జి.మాడుగుల, సింగర్భ, పంచాయతీల గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. పొలాల్లో నిలువ ఉన్న నీరును అంతర్గత కాలువలతో బయట పంపించాలని కోరారు. నేలకొరిగిన వరిని కట్టాలుగా మలచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రశాంత్‌కుమార్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు పంపిణీ

గూడెంకొత్తవీధి: తుఫాన్ బాధిత ఆదివాసీలకు జనసేన నాయకులు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి రింతాడ పంచాయతీ ఈదులబంధ, తీములమంధ గ్రామాల్లో గెమ్మెల నీలన్న, కొర్ర చిన్నమ్మి, కొర్ర రఘునాథ్‌ల గృహాల పైకప్పు, గోడలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో గురువారం బాధితులను పరామర్శించిన జనసేన అరకుపార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లె వీరవెంకట్ వారికి అవసరమైన బియ్యం, కూరగాయలు, ఆయిల్, పప్పులు పంపిణీ చేశారు. జనసేన నాయకులు వడేలు పాండురాజు, గబులంగి గణేశ్, అనిల్, తాడి రమేశ్, గెమ్మెలి కోటిబాబు పాల్గొన్నారు.

లంబసింగి ఘాట్‌లో రాత్రివేళ ప్రయాణం సురక్షితం కాదు:సీఐ

చింతపల్లి: లంబసింగి ఘాట్ రోడ్డులో రాత్రి వేళ ప్రయాణం సురక్షితం కాదని స్థానిక సీఐ ఎం. వినోద్‌బాబు అన్నారు. గురువారం ఆయన ఘాట్ రోడ్డుని ఎస్సైలు వి. వెంకటేశ్వరరావు, ఎం. వెంకటరమణతో కలిసి పరిశీలించారు. లంబసింగి జంక్షన్ వద్ద ప్రయాణికులు, స్థానిక గిరిజనులతో సీఐ మాట్లాడుతూ భారీ వర్షాలకు లంబసింగి ఘాట్ రోడ్డులు రాత్రి వేళ పడిన బండరాళ్లు, కొండచరియాలను ఆర్అండ్‌బీ అధికారుల సహకారంతో పోలీసులు తొలగించారన్నారు. మళ్లీ జారిపడే జారీపడే అవకాశం ఉందన్నారు.

తుఫాన్ సమర్థంగా ఎదుర్కొన్నాం: టీడీపీ

రాష్ట్ర ప్రభుత్వం తుఫానుని సమర్థవంతంగా ఎదుర్కొందని స్థానిక టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. గురువారం చౌడుపల్లి గ్రామంలో రైతుల సాగులోనున్న వరి పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు.

బోసి పోయిన మద్దిగరువు వారపు సంత

జి. మాడుగుల: తుఫాన్ ప్రభావంతో గురువారం మద్దిగరువు వారపు సంత బోసిపోయింది. మైదాన ప్రాంతాల వ్యాపారులు పె ద్దగా రాలేదు.

కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు: ఈఈ


గాలిపాడు రోడ్డు పరిశీలిస్తున్న ఈఈ పడాల్, జేఈ సంజీవరావు

హుకుంపేట: వర్షాలతో కోతకు గురైన రహదారులకు మరమ్మతు పనులు చేపట్టనున్నట్టు పంచాయతీరాజ్ ఈఈ తమర్బ పడాల్ తెలిపారు. గురువారం మండలంలోని గత్తున్ నుంచి గాలిపాడు గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీ రాజ్ నిధులతో రూ. 2కోట్లతో నిర్మాణ పనులు జరుతున్న సమయంలో రోడ్డు కోతకు గురైందన్నారు. ఈ కార్యక్రమంలో జేఈ సంజీవరావు సర్పంచ్ పోతురాజు, పాల్గొన్నారు.

ప్రభుత్వ అప్రమత్తతతోనే నష్ట నివారణ

▸▸ జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్

దుంబ్రిగుడ, అక్టోబర్30 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం అప్రమత్తతోనే మొంథా తుఫాన్‌పై నష్టాన్ని నియంత్రించినట్టు జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కించుమండ, కితలంగి మధ్య కాజ్‌వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం తుఫాన్‌పై ముందుగా ప్రజలను అప్రమత్తం చేయడంతో ఎటువంటిప్రాణ నష్టం జరగలేదన్నారు. కించుమండ, కితలంగి మధ్య కాజ్‌వేను తక్షణమే మరమ్మతులు చేసేలా చూడాలని సంబంధిత అధికారులకు ఫోన్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కనీస వేతనాల సలమా మండలి డైరెక్టర్ సుబ్బారావు, అరకు పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ దన్నేరావు. టీఎన్‌టీయూసీ


కితలంగి కాజ్‌వేను పరిశీలిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్

ప్రధాన కార్యదర్శి స్వామి దారెలా సర్పంచి పాండురంగా స్వామి, క్లస్టర్ ఇన్‌చార్జి త్రినాధ్. నర్సయ్య, పోలీసులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి పట్టువస్త్రాలు సమర్పణ


కళ్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న సింహాచలం నాయుడు దంపతులు

పాడేరురూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాడేరులో బ్రహ్మ సమాజం ఆ ధ్వర్యంలో గురువారం టీటీడీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన శ్రీనివాస కల్యాణానికి పట్టణంలోని పట్టణంలోని ఉమానీలకంతేశ్వస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు రమాదేవి దంపతులు పట్టు వస్త్రాలన సమర్పించారు. స్థానిక మోద కిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు సిద్ధినాతి కొండలరావు, బీవీఎస్ ముకుందరావు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. శ్రీనివాస కళ్యాణానికి వచ్చిన టీటీడీ అర్చకులు పట్టణంలో గిరికైలాస క్షేత్రంగా పేరుగాంచిన ఉమానీలకంతేశ్వరస్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ధర్మకర్త సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో అర్చకులను ఘనంగా సత్కరించి స్వామి వారి చిత్ర పటాలను బహూకరించారు. అర్చకులు రామం పంతులు, యూవీ రత్నం, వి.రాజబాబు, కొట్టగుల్లి రామారావు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అదనపు పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు చర్యలు: ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో లోకేశ్

అరకులోయ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ అవసరమైన చోట్ల అదనపు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్టు పాడేరు ఆర్డీవో లోకేశ్ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 306 పోలింగ్ బూత్‌లున్నాయన్నారు. ఒక్కో బూత్‌లో 1200 ఓటర్లుకు మించి ఉందరాదన్నారు. అంతకు మించి ఉంటే అదనపు పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేరకు 11 బూత్‌ల కోసం ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

747 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాం

తుఫాన్ నేపథ్యంలో పాడేరు ఐటీడీఏ పరిధిలో సుమారు ఆరు రిలీఫ్‌కేంద్రాలను ఏర్పాటు చేసి సుమారు 747 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. అధికశాతం జి.మాడుగల మండలం సుమారు 470 మందిని తరలించామన్నారు. అరకులోయ మండలంలో సుమారు 150 మందిని తరలించామన్నారు. ఏడు పూర్తిగా, 106 పాక్షికంగా ఇళ్లు దెబ్బతిన్నట్టు గుర్తించామన్నారు.సమావేశంలో తహశీల్దార్ కుమారస్వామి, డీటీ మత్సరాజు, ఆర్ఐ శంకరరావు ఉన్నారు.

'బూసిపుట్టుని మండలం మార్చొద్దు'


ఆందోళన చేస్తున్న బూసిపుట్టు ప్రాంతీయులు


ముంచంగిపుట్టు, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి): మండలంలో గల మారుమూల బూసిపుట్టు పంచాయతీని ముంచంగిపుట్టు మండలంలో యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంతీయులు గురువారం పంచాయతీ కేంద్రంలో భారీ ఆందోళన చేపట్టారు. బూసిపుట్టు పంచాయతీని ముంచంగిపుట్టు మండలంలో కొనసాగించాలని, మద్దిగరువు మండలంలో విలీనం చేస్తే ఊరుకోమని సుమారు 200 మందికిపైగా ప్రజలు నాలుగు కిలోమీటర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంల సర్పంచ్ కె.రాజమ్మ, మాజీ సర్పంచు వి.మంగల్లన్న, నాయకులు కె.నాగేశ్వరరావు, కె.సూరిబాబు, కె.సింహాచలం, డి.తిరుపతి, కె.రాజారావు, పలు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

మత్స్యగడ్డ అందాలు


పెదబయలలో మత్స్యగెడ్డ పాయల అందాలు

పెదబయలు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెదబయలు ఏకలవ్య పాఠశాల సమీపంలోమత్స్యగడ్డ పాయలు ఆకట్టుకుంటున్నాయి. గురవారం పైన మేఘాలతో ఆకాశం, చుట్టూ పచ్చటి అందాలు మధ్యలో నీలి రంగు వర్ణంలో దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు సిద్ధం కావాలి: డీఈవో


మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పాడేరులో నవంబరు 7, 8, 9వ తేదీలలో జిల్లా స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలను విజయవంతం చేయాలని డీఈవో పి.బ్రహ్మాజీరావు కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి పాంగి సూరిబాబు ఆ ధ్వర్యంలో నిర్వహించిన పీడీ, పీఈటీల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎంఈవో మోరి జాన్ మాట్లాడుతూ ఈ పోటీలను విజయవంతానికి ఇప్పటికే 14 కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.విశ్వప్రసాద్, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ వి.కొండబాబు, పీఈటీ, పీడీ అసోసియేషన్ ఆర్గనైజేషన్ కార్యదర్శి భూపతిరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు బాలన్న, సద్దు, చిన్ని, బుద్దు, భైరాగినాయుడు, పద్మ, ప్రియాంక, రాజులమ్మ పాల్గొన్నారు.

జోగంపేటలో వైద్యశిబిరం

కొయ్యూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజేంద్రపాలెం పంచాయతీ పరిధి సోలాబు, జోగంపేటల్లో వైద్యశిబిరం ఎర్పాటు చేసి 58 మంది రోగులకు వైద్యపరీక్షల నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యాధికారి డా. జగదీశ్‌నాయక్ తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మరిగించిన వేడినీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రశాంత్‌కుమార్, కళ్యాణం, రాజేశ్వరి, భాగ్యవతి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల దుస్థితిపై వాగ్వాదం

- వాడీవేడిగా మునిసిపల్ కౌన్సిల్ సమావేశం
- పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చిన సభ్యులు
- రోడ్ల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదన్న టీడీపీ కౌన్సిలర్



సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :మునిసిపాలిటీలో ఆర్‌అండ్‌బీ రోడ్ల దుస్థితిపై కౌన్సిలర్ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన గురువారం నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి 13 అంశాలతో కూడిన అజెండా ప్రతులు చదవి వినిపించారు. ముందుగా వైస్ చైర్మన్ కోటేటి రామకృష్ణ మాట్లాడుతూ మునిసిపాలిటీలో కుక్కలు, పందుల బెడద అధికంగా ఉందని, ప్రతి నెలా మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకు వెళుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. వార్డులలో ఖాళీ స్థలాలను పందులు ఆవాసాలుగా చేసుకొని ఉండటం వలన తీవ్రమైన పారిశుధ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ కుక్కల సమస్య చాలా సున్నితమైందన్నారు. ప్రత్యేక నిబంధనలు అనుసరించాల్సి ఉందని వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాల్సి ఉందని చెప్పారు. ఒక వీధిలోంచి పక్క వీధిలోకి తరలించ కూడదని వివరించారు. 244 కుక్కలకు సం తానం కలగకుండా శస్త్ర చికిత్సలు చేయించామన్నారు. పశుసంవర్థక శాఖ అధికారులతో మాట్లాడి మరోసారి శస్త్ర చికిత్సలు చేయించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైసీపీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర మాట్లాడుతూ 14వ వార్డు జోగినాథునిపాలెంలో సీసీ రోడ్డు మరమ్మతులకు నిధులు కేటాయిస్తూ అజెండాలో పెట్టారని, అయితే మునిసిపాలిటీలో ఆర్‌అండ్‌బీ రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉన్నాయని వాటి సంగతి ఏమి చేస్తారని అధికారులను నిలదీశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో, పెదబొడ్డేపల్లి జంక్షన్‌లో పెద్ద పెద్ద గోతులు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అత్యవసరంగా మునిసిపాలిటీ నిధులతో రోడ్లు బాగుచేయించడానికి చర్యలు తీసుకోవలన్నారు. దీనిపై కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మునిసిపాలిటీ నిధులు ఖర్చు చేయడం వీలుపడదని స్పష్టం చేశారు. సమస్యను ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకు వెళతామని చెప్పారు. 18వ వార్డు కౌన్సిలర్ శెట్టి విజయాంబ మాట్లాడుతూ బలిఘట్టంలో దుర్గమ్మ గుడి, చెక్ పోస్టు వద్ద రోడ్డు అధ్వానంగా ఉందని తెలిపారు. గోతుల కారణంగా ప్రమాదాలు జరిగి తీవ్రంగా గాయపడుతున్నారని పేర్కొన్నారు. అర్బన్ పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు మరీ ఘోరంగా ఉందన్నారు. రోగులు ఆస్పత్రికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి మాట్లాడుతూ జోగినాదునిపాలెం రోడ్డు అత్యవసరంగా బాగు చేయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అదే సమయంలో మిగిలిన రోడ్ల విషయం కూడా పట్టించుకోవలన్నారు. 24వ వార్డు కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు మాట్లాడుతూ రోడ్ల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదన్నారు. గత ఐదేళ్ల మీ ప్రభుత్వంలో ఏంచేశారని వైసీపీ కౌన్సిలర్లను ఉద్దేశించి ప్రశ్నించారు. అనంతరం కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ మీడియాతో మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ రోడ్లు మునిసిపాలిటీ నిధులతో ఎలా సాధ్య పడుతుందని ప్రశ్నించారు. మరికొంతమంది సభ్యులు సమస్యలను సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



సభలో వైసీపీ, టీడీపీ కౌన్సిర్ల మధ్య వాగ్వాదం



గొలుగొండ మండలం లింగంపేటలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



నాతవరం మండలం ఎం.బెన్నవరం వద్ద భారీ వృక్షాన్ని తొలగిస్తున్న దృశ్యం

వాన తగ్గినా.. వరద తగ్గలే..!

- చెరువులు, నదులు, రిజర్వాయర్లలో కొనసాగుతున్న వరద ఉధృతి
- లోతట్టు ప్రాంతాల్లో భయం..భయం..
- 'రావణాపల్లి' గట్టుకు పొంచి ఉన్న ప్రమాదం
- ఏ పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు అప్రమత్తం



గొలుగొండ మండలంలో పొంగి ప్రవహిస్తున్న రావణాపల్లి రిజర్వాయర్

గొలుగొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ వీడినా చెరువులు, నదులు, రిజర్వాయర్లలో వరద ఉధృతి కొనసాగుతుండడంతో పలు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్‌కు ప్రమాదం పొంచి ఉండడంతో దిగువ గ్రామాల ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తాజా భారీ వర్షాలకు ఏటిగైరంపేట గ్రామ సమీపంలో గల రాళ్లగెడ్డ పొంగి ప్రవహిస్తుంది. రావణాపల్లి రిజర్వాయర్ ఎగువ ప్రాంతం అల్లూరి సీతారామ రాజు జిల్లాలో కొండలపై వర్షాలు పడడంతో రాళ్ల గెడ్డ పొంగింది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 358.5 అడుగులుకాగా, ప్రస్తుతం 359.5 అడుగులు నీరు చేరింది. ఇన్‌ఫ్లో వెయ్యి క్యూసెక్కులు నీరు కాగా, అవుట్ ఫ్లో వెయ్యిక్యూసెక్కులు పొర్లు నుంచి పోతుంది. అయితే గత ఏడాది జూలై నెలలోమదుం వద్ద గట్టు ప్రమాద స్థాయికి చేరడంతో మరమ్మతులు చేపట్టారు. అలాగే ఈ నెల 29వ తేదీన గేట్లు వద్ద గట్టు కుంగడంతో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం దిగువ గ్రామాలు జి.కొత్తూరు, గుండుపాల, నర్సీపట్నం మండలం నీలంపేట గ్రామాలకు ప్రమాదం పొంచి ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జలవనరుల శాఖ ఏఈ రామన్నపాత్రుడు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. గట్టు మరమ్మతులు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

కృష్ణాదేవిపేట : నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. వీధిల్లో సీసీ రోడ్డుపై వర్షపు నీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొలుగొండ మండలం ఏఎల్‌పురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, నాగాపురం, కొంగశింగి, గింజర్తి, విప్పలపాలెం, పల్లావూరు తదితర గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున భారీ వర్షంపడటంతో గోతుల్లో నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. లింగంపేట, ఏఎల్‌పురం తదితర గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారడంతో రోడ్డుపై నీరుపారుతోంది.

ముంపు పొలాల్లో అధికారుల పర్యటన

నర్సీపట్నం అర్బన్ : మండలంలోని పెదబొడ్డెపల్లిలో ముంపుకు గురైన వరిపొలాలను మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహశీల్దార్ రామారావు, ఏవో విజయలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పంటను ఏవిధంగా కాపాడుకోవాలో వారికి వివరించారు. ఎంతమేరకు పంట నష్టం వాటిల్లిందో అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని చెప్పారు.. ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



నర్సీపట్నం మండలం పెదబొడ్డెపల్లిలో వరి పొలాలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

ఎస్‌ఐ చొరవతో భారీ వృక్షం తొలగింపు

నాతవరం : మండలంలోని తుని- నర్సీపట్నం రూట్‌లో ఎం.బెన్నవరం వద్ద ఓ భారీ వృక్షం భయపెట్టేది. చిన్నపాటి గాలి వీచినా ఇటుగా రాకపోకలు సాగించాలంటేనే వాహనదారులు హడలిపోయేవారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఓ వైపు ఒరిగి ఉండేది. దీంతో వాహనాలపై వెళ్లేవారు భయాందోళన చెందేవారు. రాత్రివేళ రోడ్లపై వెళ్లే వాహనాలు తగిలేలా ఉండేది. దీని వల్ల ప్రమాదం పొంచి ఉందని పలు మార్లు పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయి. కానీ అధికారులెవరూ పట్టించుకోలేదు. దీంతో గురువారం నాతవరం ఎస్‌ఐ తారకేశ్వరరావు చొరవ తీసుకుని ఇటు ఆర్‌అండ్‌బీ, అటు విద్యుత్‌శాఖ అధికారుల సహకారంతో ఈ భారీ వృక్షాన్ని మిషన్‌తో కట్ చేయించి, జేసీబీతో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తొలగించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ



బాధితులకు బియ్యం బస్తా అందజేస్తున్న కౌన్సిలర్ చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ బాధితులకు గురువారం నిత్యావసర సరకులు పంపిణీ చేపట్టారు. మునిసిపాలిటీలోని 25, 26 వార్డుల కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, రాజేశ్ చేతుల మీదుగా మండలంలోని 65 కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కిలో కంది పప్పు, కిలో పంచదార, కిలో వంట నూనె చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రామారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండల కేంద్రం మాకవరపాలెంలో తుఫాన్ బాధితులకు ఉప సర్పంచ్ లాలం రాము, టీడీపీ నాయకుడు నాని రేషన్ సరకులను అందజేశారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలో ఉన్న నాలుగు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో వారికి 25 కేజీలు బియ్యం, నెల రోజులు సరిపడేలా రేషన్ సరకులను అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో బాలదొర, వీఆర్‌వో సూరిబాబు పాల్గొన్నారు.

'మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం వద్దు'

నాతవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. గురువారం తాండవ జంక్షన్‌లో సంతకాల సేకరణ చేపట్టి మాట్లాడారు. పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించే చర్యలను ప్రభుత్వం మానుకోవాలన్నారు. మండల మేధావుల విభాగం అధ్యక్షులు పైల పోతురాజు, సునీల్ వైసీపీ నాయకులు వేముల సూరిబాబు, బండారు నాయుడు, మంకు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి'

మాకవరపాలెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో జర్వాలు రాకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి సూచించారు. గురువారం బూరుగుపాలెం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. వైద్యాధికారిణి చరిష్మా, సిబ్బంది పలు సూచనలు చేశారు.

చోడవరంలో రూ. 6 కోట్లతో డ్రైనేజీల నిర్మాణం: ఎమ్మెల్యే



రెల్లికాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వరద ముంపునకు గురవుతున్న ప్రాంతాలలో శాశ్వత ప్రాదికన డ్రైనేజీల నిర్మాణానికి రూ. 6 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్టు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. గురువారం నీటిముంపునకు గురైన రెల్లికాలనీ, బానయ్యకోనేరు, బాలాజీనగర్, దుడ్డువీధి ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. వరదనీరు బయటకు పోయేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమణలు తొలగించాలని ఆయన పంచాయతీ అధికారులను ఆదేశించారు.


పునరావాస బాధితులకు పరామర్శ

దుడ్డువీధిలోని ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించి నిర్వాసితులతో మాట్లాడారు. ఈ పర్యటనలో స్థానిక ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీపీ గాడి కాసు, సీఐ అప్పలరాజు, సర్పంచ్ నూకరత్నం స్థానిక నాయకులు సకురు కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావు, పప్పు శ్రీను, మెంబర్ శ్రీను, కొట్టాపు రూపాదేవి పాల్గొన్నారు.

బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

రావికమతం: తుఫాన్ బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు అన్నారు. గురువారం స్థానిక పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న 34 కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు కోమటి శంకరావు, విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు సాలాపు రమేష్, గోకివాడ కోటేశ్వరావు, మండల ప్రత్యేక అధికారి సుజాత, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో మహేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎంపిక



నూతన కార్యవర్గ సభ్యులు

చోడవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుల మండల కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా ఆర్‌వీఎస్ సత్యనారాయణ నియమితులయ్యారు. సొసైటీ అ.ధ్యక్షుడిగా వ్యవహరించిన గొల్లు శ్రీనివాసరావు పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో సత్యనారాయణ నియమితులయ్యారు. అలాగే, కార్యదర్శిగా కె. మల్లేశ్వరరావునుఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్‌గా ఎస్. భాస్కరరావును ఎన్నుకున్నారు.

పారిశుధ్యం మెరుగుకు కృషి

మాడుగుల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పారిశుధ్య పనులపై చర్యలు తీసుకుంటున్నట్టుఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మాడుగుల పలు వీధులు డ్రైనేజీలు పరిశీలించారు.

రావికమతం: గ్రామాల్లో పారిశుధ్య పనుల్లో అందరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేక అధజకారిణి సుజాత కోరారు. రావికమతంలో గురువారం నిర్వహించిన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీవో మహేష్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, పంచాయతీ సిబ్బందితో కలసి తొలగించారు. బ్లీచింగ్ చల్లించారు కార్యదర్శి కృష్ణమోహన్, గ్రామస్థులు, పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండలంలోని వాకపల్లి గ్రామంలో జడ్పీ సీఈవో నారాయణ మూర్తి గురువారం పర్యటించారు. రక్షిత పథకాలు క్లోరినేషన్ చేయ్యక పోవడంపై సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రిసత్యం, ఎంపీడీఓ సువర్ణరాజు, పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ, ఆర్.డబ్ల్యూఎస్ ఏఈఈ చంద్రశేఖరు, ప్రసాదు, వి.పి.విత్రినాద్ తది తరులు పాల్గొన్నారు.



నీటిముంపులో ఉన్న చోడవరం పట్టణంలోని బాలాజీనగర్



చీడికాడమండలం గొల్లవాని చెరువు బంద గట్టుకు పడిన గండి

వీడని వర్షం.. తీరని కష్టం

- కాలనీలను ముంచెత్తిన వరదనీరు
- చోడవరం వాసులు అవస్థలు

చోడవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏకధాటిగా గురువారం సుమారు 3గంటల పాటు కురిసినభారీ వర్షానికి పట్టణంలోని లోతట్టు ప్రాంత ఇళ్లలోనికి భారీగా వరదనీరు చేరడంతో స్థానికులంతా పునరావాస శిబిరాలకు చేరారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకూ విరామం లేకుండా వర్షం కురిసింది. ఇప్పటికే నీటిముంపులో ఉన్న బాలాజీనగర్, కో ఆపరేటివ్ కాలనీ, బానయ్య కోనేరు ప్రాంతాలతో పాటు, రెల్లికాలనీలోనికి భారీగా వరదనీరు చొచ్చుకుని వచ్చింది. రెల్లికాలనీలోని నివాసితులంతా దుడ్డువీధిలోని పునరావాస కేంద్రానికి చేరుకున్నారు. దీనితో స్థానిక సీఐ అప్పలరాజు, ఎంపీడీవో ఆంజనేయులు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు ఎక్స్‌కవేటర్‌తో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కాలువలను వెడల్పు చేసి వరదనీరు బయటకు పోయేలా చర్యలు చేపట్టారు. ఇంకా కాలనీల్లో నీరు నిల్వ ఉండడం గమనార్హం.కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ గాడి కాసు, నాయకులు సకురు కోటేశ్వరరావు, సర్పంచ్ బండి నూకరత్నం, ఎంపీటీసీకొట్టాపు రూపాదేవి పాల్గొన్నారు.

తాగునీటి పంపుహౌస్ గల్లంతు

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడలో ఇందిరమ్మకాలనీకి నిత్యం తాగునీరందించే మోటారు బోరు, షెడ్డు ఉధృతంగా ప్రవహిస్తున్న శారదానది ప్రవాహంలో కొట్టుకుపోయాయి. సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, వార్డు మెంబరు తనకల (పట్టాలు) అప్పలనాయుడు, గురువారం పం పుహౌస్‌ను పరిశీలించారు.

రోలుగుంట : మండలంలోని అర్ల పంచాయతీ శివారు పిత్రిగెడ్డలో బుధవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన కొర్రా కృష్ణ ఇల్లు కూలిపోయింది. నిద్రిస్తున్న సమయంలో శబ్దం రావడంతో ఇంట్లో నివస్తున్న కుటుంబ సభ్యులు అప్రమత్తమై పక్కంటికి వెళ్లి తలదాచుకోవడంతో ప్రమాదం తప్పింది.

నేలకొరిగిన వరి చేలు

మాడుగుల రూరల్ : జాలంపల్లిలోని ప్రాథమిక పాఠశాల ప్రహరిగోడ వర్షాలకు నానిపోయి గోడ పడిపోయింది. అలాగే చింతలూరు, పొంగలిపాకల, గొటివాడ పలు గ్రామాల్లో వరి చేలు నేలకొరిగాయి. వడ్డాది-పాడేరు ఆర్ అండ్ బి రోడ్డు మరింత గోతులు పడి అధ్వానంగా తయారైంది. అలాగే, వరిపొలాల్లో నీటి నిల్వలు లేకుండా రైతులు తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని కొండెంపూడి కేవీకే శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, సౌజన్య, నర్సీపట్నం ఏడీ శ్రీదేవి, ఏవో అనసూయ అన్నారు. గురువారం ఎం.కృష్ణాపురం, గాదిరాయిలోని పొలాలను పరిశీలించారు. సిబ్బంది పరిమళ, జగ్గారావు, సతీశ్, రైతులు పాల్గొన్నారు. లోవ గవరవరం వంతెనపై నుంచి వరదనీరు పారింది. జంపెన, గొటివాడ అగ్రహారం, వీరవిల్లి అగ్రహారం వంతెనల వద్ద పెద్దేరు పొంగి ప్రవహిస్తున్నది. నదిని ఆనుకుని పొలాల్లోకి వరదనీరు చేరింది.

బుచ్చెయ్యపేట: మండలంలో బంగారుమెట్ట జంక్షన్ వద్ద గురువారం వర్షపు నీటి ప్రవాహనికి బిఎన్ రోడ్డుపై గుంతలను ఎంపీడీవో శివ ప్రసాద్ నారాయణ రావు, డిప్యూటీ ఎంపీడీవో లవరాజు ఆధ్వర్యంలోరెడ్ మిక్స్‌తో పూడ్చించారు. కాలువలచేయించి నీరు నిల్వ ఉండకుండా చేశారు. దీంతో వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేశారు.



శారదానదిలో కొట్టుకుపోయిన మోటారు బోరు, షెడ్డు



పిత్రిగెడ్డలో కూలిన పెంకిటిల్లు

చీడికాడ: జి. కొత్తపల్లిలో గొల్లవాని చెరువు గట్టు బుధవారం అర్ధరాత్రి కొట్టుకుపోయింది. గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవో పట్నాల గోపి, ఆ గ్రామ సర్పంచ్ కొల్లి సూర్యనాయుడుతో కలసి పరిశీలించారు. చెరువు కింద సుమారు 15 ఎకరాలు నీటి ముంపునకు గురైనట్టు గుర్తించారు. గుంటు కొత్తూరు సమీపంలో రెండు ఎకరాలు నేల మట్టమైంది.

బోసిపోయిన కోనాం సంత

వర్షాలతో గురువారం కోనాంలో సంత బోసిపోయింది. ఏజెన్సీ మైదాన ప్రాంతాల నుండి కొనుగోలు దారులు ఎవరూరాక వ్యాపారులు నిరాశ చెందారు.

బుచ్చెయ్యపేట:మండలంలో గురువారం ఉదయం కురిసిన కుండ పోతవర్షం కురిసింది. వడ్డాది పెద్దెరు, విజయరామరాజుపేట తాచేరు వంతెనల వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వందలాది ఎకరాల్లో పంట పోలాలు నీట మునిగాయి. బీఎన్ రోడ్డు, రాజాం,తురకలపూడి రహదారులు అస్తవ్యస్తంగా మారి రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రాజాం లో అప్పలనాయుడు చెరువుకు గండి పడింది. వడ్డాదిలో తాగు నీటి పంప్ హౌస్ నీట మునిగింది. దీంతో ఇంటికివాటర్‌క్యాను అందిస్తున్నట్టు వడ్డాది ఈవో, డిప్యూటీ ఎంపీడీవో లవరాజు తెలిపారు. వడ్డాది, విజయరామరాజుపేట వంతెనలను మండల ప్రత్యేక అధికారి గోపాలరాజు, తహశీలార్ ఎం. లక్ష్మి, ఎంపీడీవో శివ ప్రసాద్ నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: గురువారం ఉదయం కురిసిన కుండ పోత వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పలు గ్రామాల్లో వరి చేలు నేలకోరిగాయి.

రోలుగుంట: వర్షాలకు కొండ శిఖర గ్రామాలైన పిత్రిగెడ్డ, నీళ్లబంధ గ్రామాల్లో చోడి, మెట్టధాన్యం నష్టజరిగినట్టు గిరిజనులు కిల్లో రాజు, మర్రి సన్యాసిరావు,గెమ్మిలి సీతమ్మ, గెమ్మిలి వాణి కోరారు. ఈ మేరకు గురువారం ఏఓ చిరంజీవి సిబ్బందితో వెళ్లి ఆయా గ్రామాల్లో పర్యటించి వివరాలను సేకరించారు.

రావికమతం: వర్షాలకు పంటలు దెబ్బతినడంతో చీమలపాడు శివారు నేరేడు బంద గ్రామ ఆదివాసీలు కిల్లో పొట్టిదొర , డిప్పల అప్పారావు తదితరులు వాపోయారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.



నేరేడుబందలో వర్షాలకు దెబ్బతిన పంటను చూపుతున్న ఆదివాసీలు



రాజాం రోడ్డు పై ప్రవహిస్తున్న చెరువు నీరు



నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

విధులకు గైర్హాజరైన వైద్యాధికారిపై చర్యలు: డీఎంహెచ్‌వో



కొత్తకోట పీహెచ్‌సీలో గర్భిణులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

రావికమతం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి విధులకు గైర్హాజరుపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ హైమావతి తెలిపారు. పీహెచ్‌సీని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో వైద్యాధికారి-1 సురేఖ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రెండవ వైద్యాధికారి ఉదయ్‌కుమార్ లేకపోవడాన్ని గుర్తించారు. ఆయన సెలవు పెట్టారా.. లీవ్ లెటర్ ఎక్కడని సిబ్బందిని ప్రశ్నించారు. దీనికి సిబ్బంది నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో మండిపడ్డారు. ఆయనపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆసుపత్రిలో గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

వంతెనల నిర్మాణంపై నిర్లక్ష్యం

బుచ్చెయ్యపేట అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలో విజయరామరాజుపేట, వడ్డాది కాజ్‌వేలను చోడవరం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎన్ రోడ్డు, వడ్డాది, విజయరామరాజుపేట వంతెనల నిర్మాణం పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. నీటి మునిగిన వరి పొలాలను పరిశీలించారు.

మండల సమావేశం వాయిదా

చోడవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో గురువారం నిర్వహించాల్సిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని వచ్చే నెల 5కి వాయిదా వేశారు. ఎంపీడీవో ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు తుపాను సహాయ చర్యల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ స్థితిలో గురువారం మధ్యాహ్నం వరకూ సమావేశానికి ఎవరూ హాజరుకాలేదు. దీనితో ఈ సమావేశాన్ని నవంబరు 5వతేదీకి అధికారులు వాయిదా వేశారు.

ఘనంగా మరిడిమాంబ పండుగ

బుచ్చెయ్యపేట అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రాజాం మరిడిమాంబ పండుగ గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి రూ. నోట్లతో ఓ భక్తుడు అలంకరించారు. ఉత్సవ కమిటీ ప్రసాద వితరణ చేశారు.

నిత్యావసరాలు అందించాలని నిరసన

దేవరాపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వాలాబు శివారు బొర్ర చింత గ్రామానికి వర్షాలతో నది దాటలేకుండా ఉన్న గిరిజనులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.టి.దొర డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు నిరసన తెలిపారు. పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆగని వరద.. వీడని ముంపు



అనకాపల్లి మండలం వెంకుపాలెంలో నీటమునిగిన వరి పొలాలు

జిల్లాలో తుఫాన్ ప్రభావం తగ్గినప్పటికీ నదులు, గెడ్డలు, వాగుల్లో వరద ఉధృతి కొనసాగుతూనే వుంది. గురువారం ఉదయం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు రెండో రోజైన గురువారం కూడా ముంపులోనే వున్నాయి. రహదారులు మరింత ఛిద్రం అయ్యాయి. పలుగ్రామాల్లో పురాతన మిద్దె, పెంకుటిళ్లు కూలిపోయాయి. అదృష్టవశాత్తూ ముందుగానే పునరావాస శిబిరాలకు వెళ్లడంతో ప్రాణనష్టం తప్పింది. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ పంటలకు వాటిల్లిన నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.



అచ్యుతాపురం మండలం కడపాలెం వద్ద సముద్రాన్ని తలపిస్తున్న ఉప్పుటేరు



నీటమునిగిన మునగపాక మండలం యాదగిరిపాలెం



పాయకరావుపేట మండలం మాసాహెబ్‌పేటలో కూలిన పెంకుటిల్లు



అనకాపల్లి మండలం తుమ్మపాల-బొజ్జన్నకొండ మధ్య నీట మునిగిన వరి పొలాలు



భారీ వర్షానికి నీటమునిగిన చోడవరం రెల్లి కాలనీ



చోడవరం మండలం గోవాడ వద్ద శారదా నది ఉగ్రరూపం



చోడవరం మండలం సింహాద్రిపురం వద్ద ముంపులో చెరకు తోటలు



కశింకోట మండలం ఉగ్గినపాలెం వద్ద జాతీయ రహదారిని ముంచెత్తిన వర్షం నీరు



రాంబిల్లి మండలం కొత్తూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మేజర్ శారదా నది



మునగపాక మండలం చూచుకొండ-గణపర్తి మధ్య వంతెన మీదుగా ప్రవహిస్తున్న రోలుగెడ్డ



అనకాపల్లిలో శారదా నది ఒడ్డున శివాలయం ఆవరణలో చేరిన వరద నీరు

యాదగిరిపాలెం జలమయం

- శారదా నది పోటెత్తడంతో గ్రామంలోకి భారీగా చేరుతున్న వరద నీరు
- రామాలయం, అంగన్‌వాడీ కేంద్రంలో పునరావాస కేంద్రాల ఏర్పాటు

మునగపాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీరం దాటినా దాని ప్రభావం వరద రూపంలో ప్రభావం చూపుతోంది. పలు రిజర్వాయర్ల గేట్లు ఎత్తివేయడంతో శారదానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని యాదగిరిపాలెం గ్రామాన్ని వరద నీరు ముంచెత్తింది. చూచుకొండ-గణపర్తి వంతెన పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. యాదగిరిపాలెం గ్రామంలోకి వరదనీరు చేరడంతో గురువారం తెల్లవారుజాము 4 గంటల సమయంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అక్కడికి వెళ్లారు. రామాలయం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామస్థులను అక్కడికి తరలించారు. మధ్యాహ్నం ఎస్పీ తుహిన్ సిన్హా చూచుకొండ, యాదగిరిపాలెం గ్రామాల్లో పర్యటించారు. చూచుకొండ- గణపర్తి వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద నీటిని అంచనా వేశారు. తహశీల్దార్ పి.సత్యనారాయణ, ఎస్ఐ పి.ప్రసాదరావు, తదితరులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.



జలమయమైన యాదగిరిపాలెం



చూచుకొండ-గణపర్తి వంతెనపై ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

జలాశయాలకు కొనసాగుతున్న వరద

గేట్లు ఎత్తి నదుల్లోకి విడుదల

పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో జిల్లాలోని జలాశయాల్లోకి వరద పోటు స్వల్పంగా తగ్గింది. బుధవారంతో పోలిస్తే గురువారం ఆయా జలాశయాల నుంచి నీటి విడుదలను తగ్గించారు.



రైవాడ జలాశయం నుంచి శారదా నదిలోకి విడుదలవుతున్న వరద నీరు

రైవాడకు ఏడు వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

దేవరాపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయానికి వరద ప్రవాహం కొద్దిగా తగ్గుముఖం పట్టింది. బుధవారం అత్యధికంగా 12 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరగా, గురువారంనాటికి ఏడు వేల క్యూసెక్కులకు తగ్గింది. గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లుకాగా, ఇన్‌ఫ్లోను దృష్టిలో పెట్టుకుని అధికారులు స్పిల్‌వే గేట్ల నుంచి ఐదు వేల క్యూసెక్కుల నీటిని శారదా నదిలోకి విడిచిపెడుతున్నారు. గురువారం సాయంత్రం రిజర్వాయర్ నీటిమట్టం 112.97 మీటర్లుగా నమోదైంది.



కోనాం మెయిన్ గేట్ల నుంచి విడుదల అవుతున్న వరద నీరు

కోనాం జలాశయం నుంచి 500 క్యూసెక్కులు విడుదల

చీడికాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కొనసాగు తున్న వర్షాలతో కోనాం రిజర్వాయర్‌లోకి గురువారం కూడా వరద ప్రవాహం కొనసాగింది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లుకాగా 500 క్యూసె క్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. అధికారులు స్పిల్‌వే గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని నదిలోకి విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నీటిమట్టాన్ని 98.7 మీటర్ల వద్ద స్థిరంగా వుంచుతున్నారు.




నిండుకుండను తలపిస్తున్న పెద్దేరు జలాశయం

పెద్దేరు నుంచి 800 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెద్దేరు జలాశయానికి వరదపోటు కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా గురువారం ఉదయం 940 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుంది. అధికారులు ఒక గేటు ఎత్తి 800 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేశారు.

సాయంత్రానికి ఇన్‌ఫ్లో 800 క్యూసెక్కులకు తగ్గింది. అయిన ప్పటికీ అవుట్‌ఫ్లోను 800 క్యూసెక్కులుగా కొనసాగిస్తున్నారు. నీటిమట్టం 134.6 మీటర్లుగా నమోదైంది.



కల్యాణపులోవ నుంచి సర్పా నదిలోకి విడుదలవుతున్న నీరు

కల్యాణపులోవ నుంచి 280 క్యూసెక్కులు

రావికమతం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కల్యాణపులోవ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో అధికారులు గురువారం కూడా గేట్లు ఎత్తి అదనపు నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. గరిష్ఠ నీటిమట్టం 460 అడుగులు కాగా జలాశయంలోకి 280 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. 459.05 అడుగుల వద్ద స్థిరంగా వుంచుతూ మూడు గేట్లు ఎత్తి 280 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

శారదా ఉగ్రరూపం

... 5వ పేజీ తరువాయి

పాఠశాల, దేవాలయాల్లో నీరు చేరింది. ఆకస్మికంగా వరద రావడంతో ఇళ్లలో సామాగ్రి, దుస్తులు, నిత్యావసర సరుకులు తడిసిపోయాయని వాపోయారు. కాగా శారదా నదుల గట్లకు గండ్లు పడిన సమాచారం అందుకున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌లు, పలు శాఖల అధికారులు మర్రిపాలెం, రజాల గ్రామాల్లో పర్యటించారు. ముంపునకు గురైన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కొప్పుగొండుపాలెం వద్ద మేజర్ శారదా నదిపై ఎస్‌ఏవోబీ నిర్మించిన వంతెనకు మెష్ ఏర్పాటు చేయడంతో వరద నీరు సముద్రంలోకి వెళ్లక, నది గట్లకు గండ్లు పడుతున్నాయని ఈ సందర్భంగా పలువురు రైతులు చెప్పారు. దీంతో కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు కొప్పుగొండుపాలెం వద్ద శారదా నదిపై ఉన్న వంతెనను పరిశీలించారు. అనంతరం నేవల్ అధికారులతో మాట్లాడేందుకు ఎన్ఏఓబీలోకి వెళ్లారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీనివాసరావు, తహశీల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీఓ జయమాధవి, జనసేన పార్టీ నేత సుందరపు సతీశ్‌కుమార్, టీడీపీ నేత వి.దిన్‌బాబు, పలువురు కూటమి నాయకులు వున్నారు.



శారదా నదికి గట్టుకు పడిన గండిని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



వై.లోవ గ్రామ వీధుల్లో వరద నీరు



నారాయణపురం వద్ద రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న మైనర్ శారదా నది.. నిలిచిపోయిన రాకపోకలు

జడ్పీకి తుఫాన్ నష్టం రూ.4.37 కోట్లు

విశాఖపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు జిల్లా పరిషత్ పరిధిలో భవనాలకు రూ.4.37 కోట్ల నష్టం వాటిల్లింది. ఉమ్మడి జిల్లాలో 118 పాఠశాలల భవనాలు దెబ్బతినడంతో రూ.2.16 కోట్లు, ఏడు ఎంపీడీవో కార్యాలయాలు దెబ్బతినడంతో రూ.26 లక్షలు, 88 అంగన్‌వాడీ భవనాలకు రూ.1.76 కోట్లు, మూడు పీహెచ్‌సీల భవనాలకు రూ.5.54 లక్షలు, నాలుగు సామాజిక భవనాలు దెబ్బతినడంతో రూ.10.5 లక్షల నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు.

పొంగిన జాగారం గెడ్డ

... 5వ పేజీ తరువాయి

పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి సంఘం ఏర్పడింది. అయితే గండిని పటిష్ఠంగా పూడ్చడానికి నీటి సంఘం వద్ద నిధులు లేవు. ఖరీఫ్ ముగిసిన తరువాత పనులు చేపడతామని అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలో తుఫాన్ సంభవించి భారీ వర్షాలు కురవడంతో జాగారం గెడ్డ పొంగి, పంట పొలాలను ముంచేసింది. పొట్టదశలో ఉన్న వరిపైరు నీట మునిగింది. ఎకరాకు రూ.20 వేలకుపైగా పెట్టుబడిపెట్టామని, ఒక్కరూపాయి కూడా తిరిగి వచ్చే అవకాశం లేదని బాధిత రైతులు వాపోతున్నారు. కాగా నీట మునిగిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి డి.అప్పారావు గురువారం పరిశీలించారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత పంటనష్టాన్ని అంచనా వేస్తామని తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	570
విజయనగరం	574
శ్రీకాకుళం	574